



సమ్మోహనం.. మోహినీ భస్మాసురం..

కూచిపూడిలోని బాలాత్రిపుర సుందరీదేవి సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం కళాకారులు నాట్య నీరాజనాలు అర్పించారు. 'మోహినీ భస్మాసుర' నృత్య రూపకం ఆద్యంతం రసరమ్యంగా సాగింది.

6లో

మచిలీపట్నాన్ని సీఆర్‌డీఏలో చేర్చండి

మునిసిపల్ మంత్రిని కోరానన్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నంలోని పారిశుధ్య కార్మికులకు 100 పుష్‌కార్టుల అందజేత



కార్మికులకు పుష్‌కార్టులు అందజేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నగరాన్ని సీఆర్‌డీఏ పరిధిలోకి తీసుకురావాలని మునిసిపల్ శాఖా మంత్రి నారాయణను కోరానని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. రూ.20 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన 100 పుష్‌కార్టులను మంత్రి కొల్లు రవీంద్ర బుధవారం రాత్రి మచిలీపట్నంలోని పారిశుధ్య కార్మికులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా సరైన పుష్‌కార్టులు లేక పారిశుధ్య కార్మికులు ఇబ్బందులకు గురయ్యారన్నారు. పారిశుధ్య పనులపై వైసీపీ పాలకులు దృష్టి సారించలేదన్నారు. చెత్తపై పన్ను వేసేందుకు మక్కువ చూపిన వైసీపీ నాయకులు పారిశుధ్యాన్ని ఏమాత్రం పట్టించుకోలేదని మండిపడ్డారు. గతంలో తాను మంత్రిగా ఉన్న సమయంలో కొన్న తోపుడుబండ్లు ఇప్పటి వరకు పనిచేస్తున్నాయని, ఆ బండ్లు శిథిలం కావడంతో కొత్త బండ్లు కొనుగోలు చేశామన్నారు. తడి, పొడిచెత్తను వేరు చేసేందుకు ఈ తోపుడుబండ్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. లక్ష టన్నుల చెత్తను వైసీపీ పాలకులు ఇచ్చారని, డంపింగ్ యార్డులోని ఆ చెత్తను గుంటూరుకు తరలిస్తున్నామన్నారు.

కాల్వగట్లపై ఆక్రమణలు తొలగిస్తున్నాం..

రాజకీయాలకు అతీతంగా కాల్వగట్లపై ఉన్న ఆక్రమణలు తొలగించి పూడికతీత పనులు చేపడుతున్నామని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మచిలీపట్నం మునిసిపల్ అధికారులు ఆక్రమణలు తొలగించి అందరి మన్ననలు పొందారన్నారు. కమిషనర్ మిగతా 6లో..

ధాన్యం కొనరు దారి చూపరు..!

ఓవైపు లక్షల టన్నుల ధాన్యం నిల్వ ఉంది, మరోవైపు ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ఇచ్చిన గడువు ఈ నెలాఖరుకు ముగుస్తుంది.. ఈ నేపథ్యంలో కొనుగోలు ప్రక్రియలో అధికారుల జాప్యానికి రైతులు బలైపోతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటను మిల్లుల్లో విక్రయించుకునే అవకాశం లేకపోగా, మద్దతు ధర తగ్గించి మిల్లు యజమానులు, వ్యాపారులు పెడుతున్న ఆంక్షలకు తలొగ్గి రైతులు విక్రయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

జిల్లాలో ధాన్యం కొనుగోలులో తీవ్ర జాప్యం

- నామమాత్రపు అనుమతులతో సరిపెడుతున్న అధికారులు
- ఇంకా కొనాల్సిన ధాన్యం 3.70 లక్షల టన్నులు
- రెండు రోజుల క్రితం అనుమతిచ్చింది 30 వేల టన్నులకే..
- ఈ నెలాఖరుతో ముగియనున్న ఖరీఫ్ కొనుగోలు ప్రక్రియ
- మిగిలిన ధాన్యం కొనేదెప్పుడోనని రైతుల్లో ఆందోళన
- రైతుల కష్టాన్ని దోచుకుతింటున్న ప్రైవేట్ వ్యాపారులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. రైతుల వద్ద ధాన్యం ఉన్నప్పటికీ కొనేందుకు అనుమతులు ఇవ్వకుండా పౌరసరఫరాల శాఖ అధికారులు జాప్యం చేస్తున్నారు. నామమాత్రంగానే అనుమతులు ఇస్తూ రైతుల సహనానికి పరీక్ష పెడుతున్నారు. రైతుల కష్టాలను పట్టించుకోకుండా జిల్లా అధికారులు కాలక్షేపం చేస్తుండటంతో తమ వద్ద ఉన్న ధాన్యాన్ని ఎలా విక్రయించుకోవాలో తెలియక రైతులు తలలు పట్టుకుంటున్నారు. ఈ నెలాఖరు నాటికి ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిలిచిపోతుంది. రబీలో వరిసాగుకు అనుమతులు లేకపోవడంతో ప్రభుత్వం కొనుగోలుకు అనుమతులు ఇవ్వదు. ఈ నేపథ్యంలో ఈ నెలాఖరులోగా రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని ఎంతమేర కొంటారో, అసలు కొనరో తెలియని సందిగ్ధం ఏర్పడింది. జిల్లాలోని రైస్ మిల్లర్లు, అధికారులు కుమ్మక్కై ధాన్యం కొనుగోలును నిలిపివేశారనే ఆరోపణలు వస్తున్నాయి.



కొనుగోలుకు సిద్ధంగా ఉన్న ధాన్యం

ఇంకా కొనాల్సిన ధాన్యం 3.70 లక్షల టన్నులు

జిల్లాలో 302 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొంటున్నట్లు అధికారులు నేటికీ కాగితాలపై లెక్కలు చూపుతున్నారు. అయితే, మిల్లులకు ఇచ్చిన టార్గెట్లు పూర్తయ్యాయనే కారణం చూపి రెండు నెలలుగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిలిపివేశారు. ఫిబ్రవరిలో 30 వేల టన్నుల ధాన్యం కొనుగోలుకు అనుమతులు ఇచ్చారు. ఇందులో అధికశాతం ధాన్యాన్ని డ్రయ్యర్ సౌకర్యం ఉన్న మిల్లులకు సర్దుబాటు చేసి అధికారులు చేతులు దులుపుకొన్నారు. ఈ నెల 10వ తేదీన మరో 30 వేల టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఈ ధాన్యాన్ని ఆయా మిల్లులకు సర్దుబాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం మిగతా 6లో..

రోడ్డెక్కితే బయటపడేది వైసీపీ అరాచకాలే

- మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజం

8లో



ఇఫ్తార్ (సాయంత్రం): 06-21(గురు)

సహర్ (ఉదయం) : 04-57 (శుక్ర)

మార్గం సుగమం

గుడివాడ-కంకిపాడు రహదారికి మోక్షం



పూర్తయిన వెంట్రప్రగడ-వానపాముల రహదారి నిర్మాణం

వైసీపీ ప్రభుత్వ హయాంలో.. గుంతలు పడి.. కంకరపైకి తేలి.. కాలు వేయాలంటేనే భయపడేలా అగాథంలో ఉండేది ఈ రోడ్డు. ఎన్నో ప్రమాదాలు.. ఎన్నో మరణాలు.. మరెందరో క్షతగాత్రులు.. అడుగు పెట్టాలంటేనే దడ పుట్టించిన గుడివాడ-కంకిపాడు రహదారికి కూటమి ప్రభుత్వ రాకతో మహర్దశ పట్టింది. నాలుగు నియోజకవర్గాల మీదుగా సాగే ఈ రోడ్డు అభివృద్ధికి ఇన్నాళ్లకు అడుగు పడింది. ఇప్పటికే రూ.40 లక్షలతో 2.2 కిలోమీటర్ల మేర రహదారి అభివృద్ధిని గత డిసెంబరులోనే పూర్తిచేసిన ప్రభుత్వం.. మరో రూ.5 కోట్లతో 7 కిలోమీటర్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. ఈ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి.

వైసీపీ హయాంలో ప్రమాదకరంగా మారిన రోడ్డు

- సీఆర్‌ఎఫ్ నిధులు మంజూరైనా దారి మళ్లింపు
- కూటమి ప్రభుత్వ రాకతో రోడ్డుకు మహర్దశ
- రూ.5 కోట్లతో 7 కిలోమీటర్ల మేర మరమ్మతులు
- రూ.40 లక్షలతో 2.2 కిలోమీటర్ల పనులు పూర్తి

ఆంధ్రజ్యోతి, గుడివాడ : గుడివాడ, పామర్రు, గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల పరిధిలో సుమారు 24 కిలోమీటర్ల పొడవున గుడివాడ-కంకిపాడు రహదారి విస్తరించి ఉంది. గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం కనీస మరమ్మతులు కూడా చేయకపోవడంతో దారి పొడవునా భారీ గుంతలు ఏర్పడ్డాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విడతల వారీగా పనులు చేపట్టింది. భూషణగుళ్ల రోడ్డు నుంచి వెంట్రప్రగడ వరకు 7.8 కిలోమీటర్ల మేర మరమ్మతులకు రూ.5 కోట్లు విడుదల చేసింది. పనులు శరవేగంగా జరుగుతున్నాయి. డిసెంబరులోనే రూ.40 లక్షలతో వెంట్రప్రగడ-నందమూరు అడ్డరోడ్డు వరకు 2.2 కిలోమీటర్ల మరమ్మతులు పూర్తి చేశారు.



భూషణగుళ్ల-పెదపారుపూడి మధ్యలో జరుగుతున్న పనులు

వైసీపీ హయాంలో నిధుల దారి మళ్లింపు

టీడీపీ అధికారంలో ఉన్న 2018లో గుడివాడ-కంకిపాడు రహదారి విస్తరణ, అభివృద్ధి ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ రోడ్ ఫండ్ (సీఆర్‌ఎఫ్) రూ.165 కోట్లు మంజూరు చేసింది. తొలి ప్యాకేజీగా రూ.16 కోట్లతో గుడివాడ-కంకిపాడు మధ్య నాలుగు నియోజకవర్గాల పరిధిలో 21.6 కిలోమీటర్ల మేర రహదారిని పటిష్టపరిచి, ఇరువైపులా మీటరు వెడల్పు చేయాల్సి ఉండగా, అప్పటి మంత్రి కొడాలి నాని నిధులను దారి మళ్లించారు. గుడివాడ నియోజకవర్గ మిగతా 6లో..

బాలుడి ప్రాణాలు తీసిన షెడ్డు

ఆడుకుంటుండగా కూలిన శ్లాబ్

- ఇద్దరు బాలురకు తీవ్ర గాయాలు
- యనమలకుదురు లాకుల వద్ద ఘటన

8లో



పేదల ఇళ్లకు అదనపు ఆర్థికసాయం

- విలేకరుల సమావేశంలో కలెక్టర్ బాలాజీ

6లో

అదృశ్యమైన వృద్ధురాలు మృతి

- నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి వచ్చిన బేబీ
- కుమార్తె పొలంలో కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

8లో

వాగు పోరంబోకు స్థలం కబ్జాకు యత్నం

- పాతపాడులో ఇరువర్గాల ఘర్షణ.. పోలీసులకు ఫిర్యాదు
- స్థల వివాదంలో తలదూర్చిన సస్పెక్ట్ షీటర్
- ఆ స్థలం పంచాయతీదేనన్న ఈవో

8లో

అసెంబ్లీ వాయిస్

గుడివాడ - కంకిపాడు రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలి



గుడివాడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ - కంకిపాడు రహదారిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల బుధ వారం అసెంబ్లీ సమావేశాల్లో కోరారు. అధ్వాన స్థితిలో ఉన్న రహదారి వలన జరిగిన ప్రమాదాల ఫొటోలను ఆయన అసెంబ్లీలో ప్రదర్శించారు. గత నాలుగేళ్ల కాలంలో 75 ప్రమాదాలు చోటుచేసుకు న్నాయని, 15 మంది ప్రాణాలు కోల్పోయా రని, వందల సంఖ్యలో గాయపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహదారిలోనే జరిగిన ప్రమాదంలో మాజీ ఎమ్మెల్యే రావి హరిగోపాల్ మరణించారని గుర్తు చేశారు. రిటైనింగ్ వాల్ కట్టి శాశ్వత పరిష్కారానికి చొరవ చూపాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ.జనార్ధన్‌రెడ్డి సమాధానమిస్తూ గత వైసీపీ ప్రభుత్వం చేసిన పాపాలు ఆర్ అండ్ బీ శాఖను వెంటా డుతున్నాయన్నారు. ఇప్పటికే రూ.24 కోట్ల వ్యయంతో రహదారి అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని, ఏప్రిల్ నెలాఖరులోపు పనులను పూర్తి చేస్తామని మంత్రి జనార్ధన్‌రెడ్డి వివరించారు.

మహిళా సాధికారతతో కుటుంబ వ్యవస్థ బలోపేతం



నందిగామ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మహిళా సాధికారతతో కుటుంబ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తుం దని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య అన్నారు. అసెంబ్లీలో మహిళా సాధికా రతపై జరిగిన చర్చలో ఆమె మా ట్లాడుతూ, టీడీపీ ఆవిర్భావం తరువాతే మహిళల అభ్యున్నతి ప్రారం భమైంద న్నారు. మహిళలకు ఆస్తి హక్కు కల్పిం చిన ఎన్టీఆర్ బాటలో నడుస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. ఎంతో మంది మహిళలు నేడు చిరు వ్యాపారాలు, చిన్న పరిశ్రమలు స్థాపించి కుటుం బాలను ఆర్థికం గా నిలబెడుతున్నారన్నారు. కూటమి పాలనలో మహిళలకు రక్షణ, ఆర్థిక సాధికారత లభిస్తుందన్నారు.. మహిళల కోసం పని చేస్తున్న ప్రభుత్వంలో ఉండడం గర్వంగా ఉందన్నారు.

కంకిపాడు హెడ్ రెగ్యులేటర్ మరమ్మతులకు నిధులివ్వాలి



పామర్రు, మార్చి 12 (ఆంధ్ర జ్యోతి) : కంకిపాడు హెడ్ రెగ్యులేటర్ మర మ్మతులకు అవస రమైన రూ.20 కోట్ల నిధులు విడుదల చేయాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అసెంబ్లీలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బందరు కాల్వ ఆధు నీకరణ అవ శ్యకత ను వివరించారు. పట్టిసీమ ప్రాజెక్టుతో గోదావరి జలాలను జిల్లా రైత న్నలకు అం దించి అపర భగీరథుడిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నిలిచార న్నారు. ఐదు నియో జకవర్గాల రైతులకు సాగునీటిని అందించే కంకిపాడు హెడ్ రెగ్యులేటర్ దెబ్బతిని నీటి సరఫరాకు ఇబ్బంది కరంగా మారిందన్నారు. కంకిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు మరమ్మతులు చేస్తే సాగు, తాగునీటి సమస్య పరిష్కారంతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పం నెరవే ర్చిన వారమౌతామని జలవనరుల శాఖ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

పోరంకి దేవదాయ భూములపై స్పష్టత ఇవ్వండి



పెనమలూరు, మార్చి12 (ఆంధ్రజ్యోతి) : పెనమ లూరు మండలం పోరంకి గ్రామంలోని దేవదాయ భూముల వ్యవహారంలో ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయా లని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ బుధవారం అసెంబ్లీలో డిమాండ్ చేశారు. పోరంకిలోని 423-1, 2, 3 సర్వే నంబర్లలో పదిన్నర ఎకరాల దేజదాయ భూములను ఎంతో మంది కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకుని, వాటిపై రుణాలు తీసుకొని పిల్లలను చదివిం చుకుంటున్నారన్నారు. సదరు భూములు నిషేధిత జాబితాలో ఉండడంతో వాటిపై పూర్తి హక్కులు లేక అమ్ముకోవడానికి వీలు లేకుండా పోయిందని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. గతంలో ఎన్నోసార్లు ఈ సమస్యపై ప్రభుత్వానికి అర్జీలు ఇచ్చామని గుర్తు చేశారు. స్థలాలు అనుభవిస్తున్న వారికి ఏదో ఒక విషయం తేల్చి చెప్పినట్లయితే, న్యాయస్థానాలను ఆశ్రయించే అవకాశం కల్పించిన వారమవుతామని మంత్రి రామనారాయణ రెడ్డికి విన్నవించారు.

తొమ్మిది గ్రామాలను ఒకే పోలీస్‌స్టేషన్ పరిధిలో చేర్చాలి



విజయవాడ రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూ రల్ మండలంలోని తొమ్మిది గ్రామాలను ఒకే పోలీస్‌స్టేషన్ పరిధిలోకి చేర్చాలని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ సమావేశం జీరో అవర్‌లో యార్లగడ్డ పోలీస్‌స్టేషన్‌ల సమస్యపై మాట్లాడారు. తన నియోజకవర్గంలోని విజయవాడ రూరల్ మండలం పరిధిలో తొమ్మిది గ్రామాలు ఉన్నాయని, ఆ గ్రామాలు పలు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఉండడం వల్ల ప్రజలు అయోమయానికి గురై ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తొమ్మిది గ్రామాల్లో రెండు గ్రామాలు కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండగా, ఐదు గ్రామాలు పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు గ్రామాలు నున్న పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్నాయన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్ట్యా గ్రామాలు అన్నింటికీ ఒకే స్టేషన్ పరిధిలోకి తీసుకువచ్చి సమస్యను పరిష్కరించాలని కోరారు.



వీర్రాజుకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న డీసీ కిషోర్‌కుమార్

తిరుపతమ్మ సేవలో ఎమ్మెల్సీ అభ్యర్థి సోము వీర్రాజు

పెనుగంచిప్రోలు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి సోము వీర్రాజు బుధవారం సతీసమేతంగా తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనం అనంతరం వారికి ఆలయ ప్రధాన అర్చకుడు మర్రెబోయిన గోపిబాబు ఆధ్వర్యంలో అర్చకులు వేద పండి తులు ఆశీర్వచనం అందజేశారు. శేషవస్త్రాలు, ప్రసాదాలు, చిత్రప టాన్ని ఆలయ డిప్యూటీ కమిషనర్ బి.హెచ్.వి.ఎస్.ఎన్ కిషోర్ కుమార్ అంద జేశారు. టీడీపీ ప్రముఖులు కల్లూరి శ్రీవాణి, మన్నె శ్రీనివాసరావు, డాక్టర్ కర్ల కోటేశ్వరరావు, కీసర రాంబాబు, బబ్బూరి శ్రీరామ్ పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ రేపు

ఇంద్రకీలాద్రి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి పౌర్ణమినాడు జరిగే గిరి ప్రదక్షిణ, మాసవారీ ఉత్సవాలను ఈనెల 14వ తేదీ శుక్రవారం నిర్వహిస్తు న్నట్లు ఈవో కె.రామచంద్రమోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5.55 గంటలకు ఘాట్‌రోడ్డులో టోల్ గేట్ వద్ద ఉన్న కామధేను అమ్మవారి ఆలయం వద్ద నుంచి గిరిప్రదక్షిణ ప్రారం భమవుతుందన్నారు. ఘాట్‌రోడ్ అమ్మవారి గుడి, కుమ్మరిపాలెం సెంటర్, విద్యాధరపురం, పాల ఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణ వీధి నుండి తిరిగి ఇంద్రకీలాద్రి వరకు గిరి ప్రదక్షిణ జరుగుతుందని తెలిపారు.

గత ఐదేళ్లలో జాతీయ మైనార్టీ అభివృద్ధి సంస్థ ద్వారా 3,191 మందికి లబ్ధి

● కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు

వన్‌టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గత అయిదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో 3,191 మంది లబ్దిదారులకు మాత్రమే జాతీయ మైనారిటీ అభివృద్ధి, ఫైనాన్స్ కార్పొరేషన్ (ఎన్ఎండీఎఫ్‌సి) రుణాలు అందజేసినట్లు కేంద్ర మైనారిటీ వ్యవ హారాల మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. అయిదేళ్లలో ఏపీలో జాతీయ మైనారిటీల అభివృద్ధి, ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా లబ్ది పొందిన లబ్దిదారుల వివరాలు, ఆ పథకానికి కేటాయించిన నిధులు గురించి, ప్రభుత్వ విద్యా రుణ పథకంలో క్రెడిట్ లైన్-1, క్రెడిట్ లైన్-2 లబ్ధిదారుల డేటా తెలి జేయాలంటూ విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ లోక్‌సభలో బుధవారం కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖను కోరారు. దీనికి కిరణ్ రిజిజు లిఖితపూర్వ కంగా సమాధానం ఇచ్చారు. ఐదేళ్లలో దేశవ్యాప్తంగా రూ.3,600.21 కోట్లు నిధులు విడుదల చేయగా, ఏపీకి రూ.9.68 కోట్లు విడుదల చేసినట్లు తెలి పారు.

దాహం తీర్చడమే లక్ష్యం

(ఆంధ్రజ్యోతి-నందిగామ)

నందిగామ పట్టణంలో 50 వేలకు పైగా జనాభా ఉంది. ప్రజల నీటి అవసరాలు తీర్చాలంటే నిత్యం ఏడున్నర లక్షల లీటర్ల నీటిని సరఫరా చేయాలి. ఉన్నంతలో సమ ర్థంగా నీటిని అందించేందుక అధికా రులు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. కీసర మంచినీటి పథకం వద్ద 30 హార్స్‌పవర్ రెండు మోటార్లు పని చేస్తున్నాయి. ఈ పథకం నుంచి నిత్యం లక్షన్నర లీటర్ల నీరు అందుతుంది. మునేటి పథకం వద్ద 20 హార్స్‌పవర్ నాలుగు మోటార్లు ఉన్నాయి. దీని నుంచి 1.20 లక్షల లీటర్ల నీరు వస్తుం ది. కాత్రేనిపల్లి పథకం నుంచి 70వేల లీటర్ల నీరు వస్తుంది. నందిగామ జనాభా ప్రకారం తలకు 130 లీటర్ల నీటిని అందించాలంటే ఏడున్నర లక్షల లీటర్ల నీరు అవసరం ఉంది. దీనిపై దృష్టి సారించిన అధి కారులు ఇప్పటికే పట్టణంలో ఉన్న అన్ని పైప్‌లైన్‌లకు మరమ్మతు చేపట్టారు. అదనపు నీటిని వదిలినా పగల కుండా జాగ్రత్తలు చేపట్టారు. పైప్‌లైన్లు, మంచినీటి పథకాల వద్ద విద్యుత్ వ్యవస్థకు మరమ్మతులు చేయిం చారు. పైప్‌లైన్‌ల ద్వారా నీరు అందని టీసీ కాలనీ, డీవీఆర్ కాలనీ, ఏడవ వార్డులకు కొత్తగా పైప్‌లైన్లు వేశారు. ఎక్కడైనా పైప్‌లైన్లు పగిలి నీరు అందని స్థితి నెలకొంటే తక్షణమే ఆ ప్రాంతానికి నీరు అందించేం దుకు పది ట్యాంకర్లను సిద్ధం చేశారు. మంచినీటి సర ఫరాలో ఏర్పడే అంతరాయలను అధిగమించేందు రూ.24 లక్షల నిధులను సిద్ధంగా ఉంచారు. కీసర ఎత్తి పోతల పథకం వద్ద మరో రెండు మోటార్లు, మునేరు వద్ద మరో మోటార్ ఏర్పాటు కూడా కూడా చర్యలు తీసుకున్నారు. ప్రజల సహకారం కూడా తీసుకొని వేసవిని ఎదుర్కొం టామని కమిషనర్ రమణబాబు, ఏఈ ఫణిశ్రీనివాస్, నీటి సరఫరా సిబ్బంది ఆత్మవిశ్వా సంతో చెప్పుకొస్తున్నారు. అధికారులు వాల్స్‌పై దృష్టి సారించకపోవడం వల్ల లీకేజ్‌లు ఏర్పడి నీరు వృథాగా పోతోంది. కమిషనర్ రమణబాబు, ఏఈ ఫణిశ్రీని వాస్ నిశిత పరిశీలనతో వాటి మరమ్మతులపై దృష్టి పెట్టారు. ట్యాంక్‌ల వద్ద ఉన్న భారీ వాల్వ్‌కు మరమ్మ తులు చేపడుతున్నారు.

వేసవిలో నందిగామలో తాగునీటి ఎద్దడిని అధిగమించేందుకు మునిసిపల్ అధికారు లు ప్రణాళికలు సిద్ధం చేశారు. గత ఏడాది ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ముందుగానే అప్రమత్తమైన అధికారులు మంచినీటి పథకాలను పటిష్ఠం చేశారు. అధికారులు చేస్తున్న భగీరథ ప్రయత్నాలను ప్రజలు హర్షిస్తున్నారు.





మునేటిలో కొత్త బోరు, పైప్‌లైన్‌కు మరమ్మత్తులు

చేజారిన ఏఐబీ ప్రాజెక్ట్

మునిసిపల్ ప్రజలకు తలకు 135 లీటర్ల నీటిని అందించే లక్ష్యంతో 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏషియన్ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ద్వారా రాష్ట్రం లోని పలు పట్టణాలకు భారీ మంచినీటి పథ కాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా

నందిగామ మున్సిపల్ అధికారుల భగీరథ యత్నం

నందిగామ మునిసి పాలిటీకి రూ.70 కోట్ల అంచనా లతో కృష్ణానదిపై ఈ పథకం నిర్మిం చేందుకు అనుమ తులు తెప్పించారు. కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో నిర్మించే ఈ పథకాలకు 20 శాతం రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ఈ ప్రక్రియ జరుగుతున్న సమ యంలో ఎన్నికలు రావడం, వైసీపీ అధికారం టలోకి రావడం జరిగింది. మౌలిక వసతుల కల్పనకు జగన్ ప్రభుత్వం పెద్దగా ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో ఆ పథకం పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరిగి ఈ ప్రాజెక్ట్‌పై దృష్టి సారించారు. గత ప్రభుత్వంలోని అంచనాలను రివైజ్ చేసి కొత్త ధరల ప్రకారం 89 కోట్లతో డీపీఆర్ తయారు చేసి పంపారు. ఈ పథకం పూర్తయితే 2050నాటికి పెరిగే నందిగామ పట్టణ జనాభాకు సైతం తలకు 135 లీటర్ల నీటి అందించే అవకాశం ఉండేది.

జలజీవన్ మిషన్‌పై ఆశలు

పులిచింతల బ్యాక్ వాటర్‌పై జలజీవన్ మిషన్ భారీ వాటర్ గ్రిడ్ నిర్మాణానికి సిద్ధమైంది. దీని ద్వారా శుద్ధి చేసిన నీటిని నందిగామ, జగ్గయ్యపేట ప్రాంతా లలోని గ్రామాలకు అందించనున్నారు. సంకల్పిం చారు. రూరల్ వాటర్ సప్లై శాఖ నిర్వహించబోయే ఈ పథకం ద్వారా నందిగామ, జగ్గయ్యపేట పట్టణా లకు లక్ష లీటర్ల చొప్పున నీటిని కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

పేదల గృహాలకు అదనపు ఆర్థిక సాయం

● కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ



మచిలీపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : పేదలు నిర్మాణం చేసుకునే గృహాలకు ప్రభుత్వం అదనంగా ఆర్థిక సహా యం చేసేందుకు ఉత్తర్వు లు జారీ చేసిందని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. కలెక్టరేట్‌లో తన చాంబర్‌లో బుధవారం ఆయ న విలేకరులతో మాట్లాడారు. పక్కా గృహాలు నిర్మాణం చేసుకునే పేదలకు అందించే ఆర్థిక సహాయాన్ని పెం చడం జరిగింద న్నారు. గతంలో గృహ నిర్మాణానికి ఇచ్చే మొత్తంతోపాటు ఎస్సీ బీసీ లబ్ధిదారు లకు అదనంగా ఒక్కో గృహానికి రూ.50 వేలు, ఎస్టీ లబ్ధి దారులకు రూ.75 వేలు, ఇతర ప్రత్యేక గిరిజన లబ్ధిదారు లకు లక్ష రూపాయల వరకు ఆర్థిక సహకారం అందిం చేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వు లు జారీ చేసింద న్నారు. ఈ నగదును ఒకే విడతలో కాకుండా, పునాదుల దశ నుంచి నిర్మాణం పూర్తయ్యే వరకు వివిధ దశల్లో చెల్లించడం జరుగుతుందన్నారు. జిల్లాలో 8,640 మంది బీసీ లబ్ధిదారులకు రూ.43.20 కోట్లు, 4,869 మంది ఎస్సీ లబ్ధిదారులకు రూ. 24.34 కోట్లు, 784 మంది ఎస్టీ లబ్ధి దారులకు రూ.5.88 కోట్ల మేర లబ్ధిచేకూరుతుందని తెలి పారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణసంస్థ పీడీ వెంక ట్రావ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ చేయూతను సద్వినియోగం చేసుకోవాలి : లక్ష్మీశ



ఎన్టీఆర్ కలెక్టరేట్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభు త్వం సువార్ణావకాశాన్ని కల్పించిందని, సద్వినియోగం చేసుకొని గృహ నిర్మాణాలను పూర్తిచేసుకోవాలని ఎన్టీ ఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ, పట్టణ) 1.0 కింద గృహ నిర్మాణం చేపట్టిన లబ్దిదారులకు యూనిట్ విలువ రూ.1,80,000కు అదనంగా వివిధ వర్గాల వారికి ప్రయో జనం కల్పిస్తూ రాష్ట్ర ప్రభు త్వం జీవో విడుదల చేసింద న్నారు. కలెక్టర్ లక్ష్మీశ, గృహ నిర్మాణ శాఖ అధికా రులతో కలిసి కలెక్టరేట్‌లోని వీడియా కాన్ఫరెన్సు హాలులో సమా వేశం నిర్వహించారు. ఎస్సీ, బీసీ లబ్దిదారులకు రూ .50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేలు, పీవీటీజీ (పర్వత ప్రాంత షెడ్యూల్ తెగలు)లకు రూ.లక్ష అదనపు సాయం అందుతుందని వివరించారు. ఎస్సీలకు సంబంధించి ఇప్పటికే 3,822 ఇళ్లు, ఎస్టీలకు సంబంధించి 556 ఇళ్లు, బీసీలకు సంబంధించి 4,018 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్, ఆపై దశలో ఉన్నాయని తెలిపారు. మిగిలిన లబ్దిదా రులు కూడా రూ.1.80 లక్షల యూనిట్ విలువకు అద నంగా ప్రభుత్వం అందించే మొత్తాన్ని ఉపయో గించుకొని త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసుకో వాలన్నారు. గృహ నిర్మాణ పీడీ ఆర్.లీలారాణి, డీఈ ఓ.విజయ బాబు, ఈఈ జి.కపూర్ పాల్గొన్నారు.

పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక చొరవ

ఎన్టీఆర్ కలెక్టరేట్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందని, దీనిలో భాగంగా పర్యాటకులకు మధు రానుభూతి మిగిల్చేలా ప్రత్యేక ప్యాకేజీలను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తు న్నట్లు కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా పర్యాటక మండలి (డీటీసీ) సమా వేశం జరిగింది. ఎన్టీఆర్ జిల్లాలోని పర్యా టక ప్రాంతాలు, పర్యాటక ప్యాకేజీల రూప కల్పన తదితరాలపై చర్చించారు. ఉదా హరణకు ఒక రోజు ప్యాకేజీలో కనకదు ర్గమ్మ ఆలయం, బెరం పార్కు, కొండపల్లి ఫోర్ట్, పవిత్ర సంగమం, భవానీ ఐలాండ్, బాపూ మ్యూజియం, గాంధీహిల్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్మృతి వనం ఉంటాయని వివరించారు. రెండు రోజులు, మూడు రోజులు, నాలుగు రోజుల ప్యాకేజీలను కూడా రూపొందించి, గైడ్ సదుపాయం కూడా కల్పించడం జరుగుతుందన్నారు. సిటీ ప్యాకేజీ, టెంపుల్ ప్యాకేజీ, చారిత్రక స్థలాల ప్యాకేజీ వంటి వాటిని కూడా దశల వారీగా అందు బాటులోకి తెస్తామన్నారు. దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంతో పాటు జిల్లాలో వేదాద్రి, కోటిలింగ హరి హర మహాక్షేత్రం, తిరుపతమ్మ దేవ స్థానం, స్వయంభూ వల్మీకోద్భవ వేంకటేశ్వ రస్వామి దేవస్థానం, వేణుగోపాల స్వామి దేవస్థానా ల్లో సౌకర్యాలు కూడా కల్పిస్తే టెంపుల్ టూరిజం అభివృద్ధి చెందుతుంద న్నారు. నిర్మాణం పూర్తయిన కొండపల్లి షాపింగ్ కాంప్లెక్సును త్వరితగతిన అందు బాటులోకి తెచ్చేందుకు పర్యాటక అధికా రులు చర్యలు తీసుకోవాలన్నారు. ముక్త్యాల ఏపీ టూరిజం రెస్టారెంట్, గాంధీహిల్ డిజి టల్ ప్లానిటోరియం/స్పేస్ ఆస్ట్రానమీ సెంటర్, కొండపల్లి ఫోర్ట్ లేజర్ షో, కొండ పల్లి గ్రామంలో ఎక్స్‌పీరియన్స్ సెంటర్ అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, ఏపీ టీడీసీ డివిజనల్ మేనేజర్ పీఎన్ కృష్ణచై తన్య, విజయవాడ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, జిల్లా అటవీ అధికారి జి.స తీష్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.శ్రీనివాస రావు, ఏపీ హోటల్స్ అసోసియేషన్ ప్రెసి డెంట్ ఆర్‌వీ వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.



మోహిని భస్మాసుర నృత్య రూపకంలో కళాకారుల అభినయం

రామలింగేశ్వరస్వామికి నాట్య నీరాజనం

కూచిపూడి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బాలాత్రిపుర సుందరిదేవి సమేత రామ లింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ప్రముఖ నాట్యాచార్యులు డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కళాకారులు బుధవారం పలు నాట్యాంశాలు ప్రదర్శించి స్వామివారికి నాట్య నీరాజ నాలు అర్పించారు. తొలుత శ్రీ సిదేంద్ర యోగి కళాపీఠం విద్యార్థులు భార్గవి, శ్రీలత, శ్రీవాస్తవి, వసుధ, సాత్విక, మౌనిక, లలిత, దీక్షిత, హర్షితలు గణపతి స్తోత్రం, థిల్లానా, రాజేంద్ర శబ్దం, రామదాసు కీర్తన అంశాలు ప్రదర్శించి ప్రేక్షకులను భక్తిభా వంలో ముంచెత్తారు. అనంతరం సోమయాజుల శ్రీరామ చంద్రశర్మ, ఉషామాధురి, మహంకాళి గాయత్రిలు అన్నమయ్య, త్యాగయ్య, రామదాసు, క్షేత్రయ్యలపై ఆలపిం చిన లలిత గీతాలు వినులవిందు గావించాయి. చివరిగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, శ్రీ సిద్ధేంద్ర కళాపీఠం వైస్ ప్రిన్సిపాల్ చింతా రవిబాలకృష్ణ, నృత్య దర్శకత్వంలో రూపొందించిన మోహినీ భస్మాసుర నృత్య రూపకం ప్రేక్షకులను మైమ రపించింది. భస్మాసురునిగా ద్రాక్షాయణి, మోహినిగా ప్రవల్లిక, శివుడిగా వర్షిత వర్మ, గాయత్రిగా యశస్విలు చూపిన హావభావాలు ఆకట్టుకున్నాయి.

ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

మచిలీపట్నం, మార్చి12(ఆంధ్రజ్యోతి) : పెండిం డ్ ఫీజులను కూటమి ప్రభుత్వం విడుదల చేయాలని కోరుతూ వైసీపీనాయకులు, కార్యకర్తలు బుధవారం కలె క్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. తొలుత ధర్నాచౌక్ వద్దకు వెళ్లకుండా పోలీసులు వైసీపీ నాయకులను అడ్డుకున్నారు. జిల్లా వైసీపీ అధ్యక్షుడు పేర్నినాని మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబ ర్స్‌మెంట్ విడుదల చేయలేదన్నారు. మొదటి సంతకం చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా ఎప్పటిలోగా టీచర్ ఉద్యోగాలు ఇస్తారో తెలియకుండా ఉందన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాలహారిక, మాజీ శాసనసభ్యులు కైలే అనిల్‌కుమార్, సింహాద్రి రమేష్‌బాబు, మేయర్ చిటి కెన వెంకటేశ్వరమ్మ, వైసీపీ నాయకులు ఉప్పాలరాము, పేర్నికిట్టు, ధనేకుల చక్రవర్తి, డాక్టర్ భరత్ తదితరులు పాల్గొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని కోరుతూ కలెక్టర్ బాలాజీకి వైసీపీ నాయ కులు వినతిపత్రం అందజేశారు.

ఎన్టీఆర్ కలెక్టరేట్, : ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి, మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణపై కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని నిరసిస్తూ ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్వర్యంలో 'యువత పోరు'లో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ కార్యాల యాన్ని ముట్టడించేందుకు వచ్చిన వైసీపీ నేతలు జోగి రమేష్, వెల్లంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, దేవినేని అవి నాష్, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పోతిన మహేష్, పూనూరు గౌతంరెడ్డిలను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులకు, వైసీపీ నేతలకు మధ్య తోపులాట జరిగింది. దేవినేని అవినాష్, వెల్లంపల్లి శ్రీనివాస్, జోగి రమేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యార్థులకు అన్యాయం చేస్తోందన్నారు. షేక్ ఆసిఫ్, మొండితోక జగ న్మోహన్, మల్లాది విష్ణు, సింహాద్రి రమేష్, పోతిన మహేష్, డిప్యూటీ మేయర్‌లు శైలజారెడ్డి, బెల్లం దుర్గ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పేర్ని నాని



విజయవాడ ర్యాలీలో అవినాష్, వెలంపల్లి తదితరులు

ధాన్యం కొనరు

(5వ పేజీ తరువాయి)

మినుముతీత పనులు జరుగుతుండగా, కుప్పనూ ర్పిళ్లు చేస్తున్నారు. కాగా, రైతులు ధాన్యం శాంపిళ్లను రైతుసేవా కేంద్రాలకు తీసుకెళ్తే.. ఆన్‌లైన్ ప్రక్రియ నిలిచి పోయిందని, అనుమతులు రాలేదని అక్కడి సిబ్బంది చెబుతున్నారు. ప్రభుత్వంతో సంబంధం లేకుండా రైస్ మిల్లులకు ధాన్యం విక్రయించుకోవాలని సూచిస్తు న్నారు. కుప్పనూర్పిళ్ల అనంతరం విక్రయించాల్సిన ధాన్యం రైతుల వద్ద 3.70 లక్షల టన్నులు ఉంది. ఈ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందా, లేదా అనే అనుమాలు కూడా ఉన్నాయి. ఇటీవల అనుమతులు ఇచ్చిన 30 వేల టన్నుల ధాన్యాన్ని అవసరం ఉన్న ప్రాంతాల్లోని మిల్లులకు కాకుండా ఎమ్మెల్యేలు, రైస్‌మి ల్లర్స్ అసోసియేషన్ నాయకులు, పౌరసరఫరాల శాఖ అధికారులను ప్రసన్నం చేసుకున్న మిల్లర్లకే టార్గెట్ లుగా ఇచ్చి సరిపెడతారనే ఆరోపణలు వస్తున్నాయి.

ప్రైవేట్ వ్యాపారులతో అవస్థలు

జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొని, ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం 75 కిలోల బస్తాకు రూ.1,725 మద్దతు ధర వస్తుంది. రెండు నెలలుగా జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిలిచిపోవడంతో కొనుగోలు కేంద్రాలతో సంబంధం లేకుండా మధ్యవర్తుల ద్వారా మిల్లు యజమానులకు, మండపేటకు చెందిన వ్యాపారులకు ధాన్యాన్ని విక్ర యించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో మధ్యవ ర్తులు, మిల్లర్లు బస్తా ధాన్యానికి అన్ని ఖర్చులు పోను రూ.1,500-రూ.1,600 మించి ఇవ్వలేమని చెబుతున్నారు. నగదు కూడా అప్పటికప్పుడు ఇవ్వలేమని, 15 నుంచి 20 రోజుల సమయం కావాలని వ్యాపారులు ఆంక్షలు విధిస్తుండటంతో రైతుల్లో ఆందోళనల నెలకొంటోంది. ప్రైవేటుగా ధాన్యం విక్రయిస్తే మద్దతు ధర రాకపోగా, నగదు చేతికి సకాలంలో అందని దుస్థితి ఏర్పడుతోం దని రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. వ్యాపారులె వరైనా మోసం చేస్తే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తు న్నారు. ధాన్యానికి పూర్తిస్థాయిలో మద్దత ధర లభించక పోవడంతో ఎకరాకు 30 బస్తాల దిగుబడి వస్తే, మద్దతు ధర రూపంలో రూ.6వేలకు పైగా నష్టపోతు న్నామని ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో రైతుల వద్ద ఉన్న 3.70 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనేందుకు ప్రభుత్వం సకాలంలో అనుమతులు ఇస్తుందా లేదా అనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. తమ ఇబ్బం దులను దృష్టిలో పెట్టుకుని ధాన్యం కొనుగోలుకు త్వరగా అనుమతులు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

మంచినీటి ట్యాంకుల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వండి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య ఉండకూడదని, రక్షిత తాగు నీటి పథకాల ట్యాంకుల పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. లక్ష్మీశ నందిగామ నియోజకవర్గంలో బుధవారం క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం లక్ష్యంగా విస్తృతంగా పర్యటిం చారు. అంబా రుపేటలో రక్షిత మంచినీటి ట్యాంకును పరిశీలించారు. తప్పనిసరిగా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. గ్రామం లోని బోరు నీటిని తాగి పరిశీలించారు. అ అడవి రావులపాడులో మంచినీటి పథకం ట్యాం కులను పరిశీలించారు. నీటి వనరులకు పెండింగ్ పనులు వుంటే యు ద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఎప్పటి కప్పుడు నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని ఆదేశిం చారు. నీటి ఎద్దడి వున్న ఆవాసాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలన్నారు. అనా సాగరం గ్రామ రైతులు కలెక్టర్‌ను కలిసి వరి పంటకు సాగునీటి విడుదలకు విజ్ఞప్తి చేశారు. నవాబుపేట చెరువు కింద తమ గ్రా మానికి చెందిన సుమారు 150 ఎకరాల్లో వరి పంట వేశామని, ప్రస్తుతం పంట పొట్ట దశలో వుండగా చెరువు నీళ్ల వదలడం లేదని తెలి పారు. శనగపాడు నుంచి సరఫరా నిలిచి పోవడం, మునేరులో చుక్క నీరు లేకపోవడం వల్ల మరో 400 ఎకరాలకు నీటి సమస్య ఏర్ప డిందని వివరించారు. స్పందించిన కలెక్టర్, ఇరి గేషన్ శాఖ అధికారులతో మాట్లాడి అనాసా గరం రైతుల సమస్యలను యుద్ధప్రాతిపది కన పరిష్కరించాలని ఆదేశించారు. ఆర్డీవో కె.బాలకృష్ణ, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ విద్యాసాగర్, తహసీల్దార్ ఎన్.సురేష్, ఎంపీ డీవో శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

అత్యంత కచ్చితత్వంతో రీ సర్వే పనులు

రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగు ణంగా భూ యజమానుల సమక్షంలో అత్యం త పారదర్శకంగా, జవాబుదారీతనంతో రీ సర్వే పనులు జరుగుతున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కంచికచర్ల మండలం గండే పల్లిలో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రి యను బుధవారం ఆయన పరిశీలిం చారు. రీ సర్వేలో కచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్య మివ్వాలని, ఎలాంటి తప్పిదాలకు తావులేకుం డా సజావుగా నిర్వహించాలని స్పష్టం చేశారు. గ్రామాలను భూవివాద రహి తంగా తీర్చిదిద్దేం దుకు నిర్వహిస్తున్న రీసర్వే పనులపై క్షేత్ర స్థాయి అధికారులు అప్రమ త్తంగా వుండాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. కలెక్టర్ వెంట నందిగామ ఆర్‌డీఓ కె.బాలకృష్ణ, అసిస్టెంట్ డైరక్టర్ (సర్వే, భూ రికార్డులు) టి.తివిక్రమ రావు, కంచికచర్ల ఎమ్మార్వో మానస, గ్రామ సర్వేయర్లు తదితరులున్నారు.

పీ4 సర్వేతో ప్రతి గృహానికి లబ్ధి

ప్రభుత్వం, దాతల, ప్రజల భాగస్వామ్యం (పీ4) సర్వేతో ప్రతి ఇంటికి లబ్ధి, ప్రతి జీవి తానికి ప్రగతి చేకూరుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. తన చాంబర్‌లో ప్రణాళిక శాఖ రూపొందించిన అవగాహన, క్యూఆర్ కోడ్‌తో కూడిన వాల్ పోస్టర్‌ను ఆయ న ఆవిష్కరించారు. పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం చిత్తశు ద్ధితో పనిచే స్తోందన్నారు. ప్రతి ఒక్కరూ తమ విలువైన అభిప్రాయాన్ని స్వర్ణాంధ్ర ఏపీ.జీఓవి.ఇన్/పీ4 వెబ్‌సైట్, క్యూఆర్ కోడ్ ద్వారా ఈనెల 25 తేదీ లోగా తెలియజేయాలన్నారు. జడ్పీ సీఈవో కె.కన్నమ నాయుడు, సీపీవో శ్రీలత, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, గ్రామ వార్డు సచివాల యాల ప్రత్యేక అధికారి జి. జ్యోతి, డీపీవో లావణ్యకుమారి, జిల్లా వ్యవ సాయ శాఖ అధి కారి డీఎంఎఫ్ విజయ కుమారి, డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని పాల్గొన్నారు.

మచిలీపట్నాన్ని సీఆర్‌డీఏలో చేర్చండి

(5వ పేజీ తరువాయి)

బాపిరాజు చొరవ తీసుకుని ఆక్రమణలు తొలగించారన్నారు. 13 రోజులుగా ఆక్రమణలు తొలగిస్తున్నామని, ఇందుకు నగర ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. అయితే, కొందరు చిరువ్యాపారులు నష్టపోయినట్టు చెబుతున్నారని, వారికి సరైన న్యాయం చేస్తా మన్నారు. ముద్ర రుణాలు ఇప్పించి చిరు వ్యాపారుల జీవితాల్లో వెలుగులు నింపుతామ న్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ కార్పొ రేటర్లు మరకాని సమతాకీర్తి, చిత్తజల్లు నాగ రాము, మాజీ కౌన్సిలర్ పల్లపాటి సుబ్ర హ్మణ్యం, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు పాల్గొన్నారు.

మార్గం సుగమం

(5వ పేజీ తరువాయి)

పరిధిలో 5 కిలోమీటర్ల మేర రహదారి విస్త రణ, రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు పూర్తి చేశారు.

ఎమ్మెల్యే వెనిగండ్ల ప్రస్తావన

అధ్వానంగా ఉన్న గుడివాడ-కంకిపాడు రహదారిలో జరిగిన ప్రమాదాల చిత్రాలను అసెంబ్లీలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రదర్శిం చారు. ఈ రహదారికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. నాలుగేళ్లలో 75 ప్రమా దాలు చోటుచేసుకున్నాయని, 15 మంది మర ణించారని, వందల సంఖ్యలో గాయాలపాలై వికలాంగులయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

పనులు ఏప్రిల్‌లోపు పూర్తిచేస్తాం : మంత్రి జనార్ధన్‌రెడ్డి

గత ప్రభుత్వం చేసిన పాపాలు ఆర్‌అండ్‌బీ శాఖను వెంటాడుతున్నాయని, రూ.24 కోట్లతో గుడివాడ-కంకిపాడు రహదారి అభివృద్ధి పనులు ప్రారంభమై పురోగతిలో ఉన్నాయని, ఏప్రిల్ నాటికి నూరుశాతం పూర్తి చేస్తామని మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి అసెంబ్లీలో హామీ ఇచ్చారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	95, 102, 112
చికెన్ విత్ స్కిన్	180
చికెన్ స్కిన్‌లెస్	190

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

తడి, పొడి చెత్త, వ్యర్థాలపై అవగాహన

ఉయ్యూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : తడి పొడి చెత్త, ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలు వేరుచేసి పారిశుధ్య సిబ్బందికి అందచేయాలని ఎంపీడీవో జీఎస్‌వీ శేషగిరిరావు అన్నారు. పొట్లపాడులో బుధవారం పర్యటించి తడి, పొడి చెత్త, ఇతర వ్యర్థాలు వేరుచేసి ఇవ్వడంపై ప్రజలకు వివరించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామాల్లో జరుగుతున్న పీ 4 సర్వేకు ప్రజలు సహకరించాలన్నారు. ఈవో పీఆర్డీ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



తడి, పొడి చెత్త సేకరణపై పొట్లపాడులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పేకాడుతున్న 8మంది అరెస్టు

కంకిపాడు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మం తెనలో పేకాడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై డి. సందీప్ తెలిపారు. స్థానిక విలే కరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ, మండలంలోని మంతెనకు చెందిన గన్నె సాంబశివ రావుకు చెందిన పశువుల పాకలో పేకాడుతున్న గన్నె సాంబశివరావు , మాగంటి శ్రీనివాసరావు, కర్రె శ్రీనివాసరావు, నాగబోయిన శ్రీని వాసరావు, గంప అజయ్‌కుమార్, వసంతరావు, సుబ్బారావు, నాగబోయిన సురేష్, అప్పికట్ల వీర వెంకట బుల్లయ్య గ్రామాలకు చెందిన 8 మందిని అదుపులోకి తీసుకొని వీరి నుంచి రూ. 19,180 స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు. పేకాట రాయుళ్లపై ఏపీ గేమింగ్ యాక్ట్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆటోనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఎనికేపాడు సెక్షన్ హనుమాన్‌నగర్, ప్రసాదంపాడు ఫీడర్ పరిధిలో 11కెవి విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టనున్నట్టు ఎనికేపాడు ఏఈ పరమేశ్వరరావు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం 8.30 నుంచి 11 గంటల వరకు పటేల్‌నగర్, సాయినగర్, హను మాన్‌నగర్, టెంపుల్ ఏరియా, ఫ్లైఓవర్ డౌన్ ఏరియా, రైల్వే స్టేషన్‌కట్ట, బల్లెంవారి వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంత రాయం ఉంటుందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఉయ్యూరు మండల అధ్యక్షుడిగా బాలాజీ నాయక్

ఉయ్యూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడుగా ఉయ్యూరుకు చెందిన మాళావత్ బాలాజీ నాయక్ నియమితులయ్యారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు గొల్లు కృష్ణ, పెనమలూరు నియోజకవర్గ కో- ఆర్డినేటర్ ధనేకుల మురళీమోహన్ నుంచి బుధవారం నియామక పత్రం అందుకున్నారు. తనపై నమ్మకంతో పార్టీ మండల అధ్యక్షుడుగా నియమించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

హనుమాన్‌జంక్షన్, మార్చి 12 (ఆంధ్ర జ్యోతి) : మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించడానికి ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలని బాపులపాడు ఎంఈవో రాంబాలసింగ్ అన్నారు. బుధవారం బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో పది విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ శ్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచనేని సత్యప్ర సాద్ ట్రస్ట్ తరఫున పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు. హెచ్‌ఎం టీవీ నాగేశ్వ రరావు, జడ్పీ టీసీ సభ్యురాలు కె.గంగాభవాని, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ సుంకర సుభాష్ చంద్ర బోస్, వేలేరు హైస్కూల్ హెచ్‌ఎం కె. విజయ్, విద్యా కమిటీ చైర్మన్ వై.శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ నాయకులు తాడి రంగారావు, అక్కినేని రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మకు బంగారుహారం బహూకరణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : వీరవల్లిలోని తిరుపతమ్మ, గోపయ్య స్వామి వార్ల కల్యాణమహోత్సవ సందర్భంగా గ్రామానికి చెందిన ఎన్నారై కలపాల శ్రీరుషి, అఖిల దంపతులు బంగారుహారాన్ని బహూక రించారు. ఆలయ మర్యాదలతో మేళతాళాల మధ్య బుధవారం దేవస్థానానికి చేరుకుని ఆల య ధర్మకర్త నందమూరి మురళీ కృష్ణప్రసాద్‌కు రూ. 1.20లక్షల విలువైన బంగారు హారాన్ని అందజేశారు. అర్చకుల దాతలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన వేదాశీర్వాదంతో శేషవస్త్రాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు. గుండపనేని ఉమావరప్రసాద్, కలపాల నాని పాల్గొన్నారు.



స్థలం ఓకే.. నిధులు నో!

- అభయాంజనేయ స్వామి ఆలయంలో వసతి భవనం లేక మండుటెండలో భక్తుల పాట్లు
- టెంట్ కిందే అన్నప్రసాద వితరణ
- నిధుల మంజూరునకు ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ హామీ



మండుటెండలో క్యూలో నిలబడిన భక్తులు (ఫైల్)

(హనుమాన్‌జంక్షన్ - ఆంధ్రజ్యోతి)

ఏలూరు-కృష్ణాజిల్లా సరిహద్దు హనుమాన్ జంక్షన్ అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రతి మంగళవారం ఉచిత అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించడానికి సరైన వసతి భవనం లేక ఇబ్బంది పడుతున్నారు.

ఆలయ కార్యాలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడానికి అనువైన స్థలం ఉన్నప్పటికీ వసతి భవనం నిర్మించుకోవడానికి నిధులు లేవు. తాత్కాలికంగా టెంట్లు వేసి దాతల సహకారంతో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చినపుడు మండుటెండలో నిలబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. స్వామి మీద భక్తితో మండుటెండలోనే భోజనం చేయడానికి ముందుకు వస్తున్నారు. అన్నదాన కార్యక్రమం 2023 ఆగస్టు నుంచి దాతల సహ కారంతో ప్రతి మంగళవారం దేవస్థానం నిర్వహి స్తోంది. టెంట్లు వేసి నిర్వహించడం వలన వర్షా కాలంలో మరింత ఇబ్బందిగా మారుతోంది. గత పాలకవర్గం, స్థానిక పెద్దలు దాతల సహకారం తోనైన భవనం నిర్మించాలని భావించారు. ఈ లోగా ప్రభుత్వం మారింది. గత ఏడాది ఎన్నికల అనంతరం ఏలూరు ఎంపీగా ఎన్నికైన పుట్టా మహేశ్‌కుమార్ తొలి సారి ఆలయాన్ని సందర్శించినపుడు ఆలయం వద్ద నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని కూడా పరిశీలించారు. ఆ సందర్భంగా గ్రామ పెద్దలు అన్నదానం నిర్వహించడానికి స్థలం ఉన్నప్పటికి భవనం నిర్మించడానికి నిధులు లేక కొరత ఉందని ఆలయ అధికారులు, గ్రామ కూటమి నాయకులు ఎంపీ దృష్టికి తెచ్చారు. ఎంపీ సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

నిధులు మంజూరునకు ఎంపీ హామీ

అభయాంజనేయ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం నిర్వహణకు శాశ్వత భవనం ఏర్పాటుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తానని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ మరో మారు హామీ ఇచ్చినట్లు ఆలయ ఈవో తారకేశ్వరరావు తెలిపారు. ఇటీవల ఏలూరులో ఎంపీని మర్యాద పూర్వకంగా కలిసి గతంలో భవన నిర్మాణానికి ఇచ్చిన హామీని గుర్తు చేశారు. సానుకూలంగా స్పందించిన ఎంపీ భవన నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఈవోకు సూచించారు.

కమిషనర్‌ను దూషించిన వ్యక్తిపై కేసు

పెనమలూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మునిసిపల్ కమిషనర్ భవానీప్రసాద్‌ను, మునిసిపల్ సిబ్బందిని దూషించిన వ్యక్తిపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరుకు చెందిన వేణుగోపాల్ మునిసిపాలిటీ పరిధిలోని పలు సమస్యలపై కంప్లయింట్స్ విభాగంలో అర్జీలు ఇచ్చాడు. అర్జీలలో ఖాళీ స్థలాల పన్నుల వసూలు విభాగ అంశం కూడా ఉంది. ఈ ఫిర్యాదుకు సంబంధించిన పరిష్కార వివరాలు తెలిపేందుకు ఈనెల పదిన మునిసిపల్ అధికారులు అతని ఇంటికి వెళ్లారు. అధికారులతో మాట్లాడుతూనే వేణుగోపాల్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ మునిసిపల్ కమిషనర్‌ను, అధికారులను అసభ్య పదజాలంతో దూషించాడు. మునిసిపాలిటీ గ్రేడ్‌5 సెక్రటరీ కిషోర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కెరీర్ గైడెన్స్‌పై వర్క్‌షాప్

ఉయ్యూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : వివిధ రంగాల్లో ఉన్న అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని కెరీర్ కౌన్సిలర్ ఏపూరి శ్రీనివాస్ అన్నారు. కలవపాముల శ్రీజ్యోతి పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు గుడివాడ రోటరీ క్లబ్ ఆధ్వర్యాన బుధవారం నిర్వహించిన కెరీర్ గైడెన్స్ వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని విద్యార్థులను ద్దేశించి మాట్లాడారు. రోటరీక్లబ్ సెక్రటరీ జి కిరణ్ బాబు, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సూరపనేని వెంకటరమణ, ప్రిన్సిపాల్ జన్ను శివకుమార్, ఏవో పసలపూడి మురళీకృష్ణ పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న శ్రీనివాస్

అభివృద్ధి చేసి చూపిస్తాం: ఎమ్మెల్యే బోడె

పెనమలూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కూటమి పాలనలో అభివృద్ధి చేసి చూపిస్తామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఇటీవల 67.5 లక్షల వ్యయంతో నిర్మించిన తాడిగడప ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రికి వెళ్లే రోడ్డును ఆయన బుధవారం ప్రారంభించి మాట్లాడారు. తాడిగడప మునిసిపాలిటీలో యనమలకుదురు, తాడిగడప, కానూరు, పోరంకి క్లస్టర్లలో డ్రైన్లు, రోడ్ల నిర్మాణాలను చేపట్టామని తెలిపారు. పెనమలూరు నియోజకవర్గం మొత్తం మీద సుమారు రూ. 60 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



తాడిగడపలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

రూ. 2.40 లక్షల ఎల్వోసీలు అందజేత

ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. 2.40 లక్షల విలువైన ఎల్వోసీలను బుధవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ లబ్ధిదారులకు అందజేశారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

కానూరు వేణుగోపాల స్వామి ఆలయ ఈవోపై క్రమశిక్షణ చర్యలు తీసుకోండి

ఈనెల 8నుంచి 10వరకు కానూరు వేణుగోపాల స్వామి ఆలయంలో జరిగిన వార్షిక బ్రహ్మోత్సవాల్లో ప్రోటోకాల్ పాటించకుండా స్థానిక వైసీపీ నాయకులతో ఉత్సవాలు నిర్వహించిన ఆలయ ఈవో సీహెచ్ వీఎస్ సుబ్రహ్మణ్యంపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలంటూ స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ దేవాదాయ శాఖ కమిషనర్‌కు సిఫార్సు చేశారు. ఆలయ ఈవో ప్రోటోకాల్ పాటించడంలో విఫలమయ్యారంటూ...ఈవోను వెంటనే విధుల నుంచి తప్పించి అతడిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

పది పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు

గుడివాడ డీవైఈవో కొండా రవికుమార్

గన్నవరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పది పబ్లిక్ పరీక్షలకు డివిజన్ పరిధిలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గుడివాడ డీవైఈవో కొండా రవికుమార్ అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఈ ఏడాది 10వ తరగతి పరీక్షల్లో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు విశేషకృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఉదయం సాయంత్రం గంట చొప్పున ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గుడివాడ డివిజన్‌లోని 14 మండలాల్లో 12,624 మంది విద్యార్థులు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. 105 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 5,736 మంది, 114 ప్రైవేటు పాఠశాలలకు చెందిన 6,888 మంది విద్యార్థులు ఉన్నట్లు చెప్పారు. డివిజన్ పరిధిలో 83 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో బెంచీలు, ఫ్యాన్‌లు, ట్యూబ్‌లైట్లు, వెంటిలేషన్, టాయిలెట్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయులకు పరీక్షల డ్యూటీల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేశామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలు చేయనున్నట్లు తెలిపారు. అలాగే వైద్య సిబ్బంది కూడా అందుబాటులో ఉంటారని చెప్పారు.

పిఠాపురం సభను విజయవంతం చేయండి

కంకిపాడు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంలో ఈ నెల 14న నిర్వహించనున్న జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభను విజ యవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పులి కామేశ్వరరావు అన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఏర్పాటు అయింది జనసేన అన్నారు. పార్టీ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు ఎటువంటి లాభాపేక్ష లేకుండా పుట్టిన పార్టీ జనసేన అన్నారు. 2024 ఎన్నికల్లో నూరు శాతం స్ట్రైక్ రేట్‌తో రికార్డు సృష్టించిన ఘనత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వకర్తలు వడ్డీ జీవ, లోకేష్ కాకాని, గరికిపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● కంకిపాడు జనసేన పార్టీ కార్యాలయంలో చలో పిఠాపురం పోస్టర్‌ను ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సుంకర శివ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు బోయిన నాగరాజు, పవన్, సుంకర సురేష్, లేళ్ల అయ్యప్ప, నూతక్కి శేషు, దొప్పలపూడి రంజిత్, తంబళ్ల వీరస్వామి, పచ్చిపాల శేఖర్ పాల్గొన్నారు.

290 మందికి వైద్యసేవలు

గన్నవరం, మార్చి 12 (ఆంధ్ర జ్యోతి) : విశ్రాంత ఉద్యోగుల ఆరోగ్య భద్ర తను దృష్టిలో పెట్టుకుని ప్రతి నెల వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఆవుటపల్లి మోహనరావు అన్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సేవా భవనంలో బుధవారం ఏపీ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. 290మంది వైద్యసేవలు పొందారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్‌కె ఆదాంవలిసాహెబ్, ఉపాధ్యక్షులు వై.రామ చంద్రరావు, వి.సుబ్బారావు, అప్పారావు, ఏపీ ఎన్‌జీవోస్ మాజీ అధ్యక్షులు పోలిమెట్ల జయరాజ్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



రిటైర్డ్ ఉద్యోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు



మద్దూరు రోడ్డుపై ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

రోడ్డు అభివృద్ధికి కృషి చేయాలి : సీపీఎం

కంకిపాడు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : అధ్వానంగా ఉన్న మద్దూరు - గోసాల రహదారి అభివృద్ధి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోడ్డు అభివృద్ధి చేయాలంటూ మద్దూరు ప్రధాన రహదారిపై బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వై. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. గోసాల - వణుకూరు - మద్దూరు ప్రధాన రహదారి అధ్వానంగా ఉందన్నారు. అనేక సంవత్సరాలుగా ఈ రహదారిపై ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. వేల సంఖ్యలో వాహనదారులు, ప్రజలు రాకపోకలు సాగిస్తున్న ఈ రహదారి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి తాడంకి నరేష్, పి. దుర్గారావు, పి. నాగేశ్వరరావు, పి. సాంబశివరావు, వెంకటేశ్వరరావు, అప్పారావు, ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

పోరుబాట చేసే హక్కు వైసీపీకి లేదు

తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కొసరాజు సాయిరామ్

గన్నవరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): యువత సమస్యలపై పోరు బాట చేసే హక్కు వైసీపీకి లేదని తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కొసరాజు సాయిరామ్ అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, దమ్ముంటే వైసీపీ బ్యాచ్ తాడేపల్లి ప్యాలెస్ ముందు పోరుబాట చేయాలన్నారు. విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు చెల్లించకుండా విద్యార్థులను మోసం చేసింది జగన్ రెడ్డి కాదా అని ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తీసుకువచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని, స్కాలర్‌షిప్‌లను రద్దు చేసి విద్యార్థులను ఇబ్బందులు పెట్టారని మండిపడ్డారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న వైసీపీ ఇప్పుడు న్యాయం చేయమని పిలుపునివ్వటం హాస్యాస్పదం అన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడతారా అని మండిపడ్డారు.

పురుషులతో సమానంగా వేతనం ఇవ్వాలి

హనుమాన్‌జంక్షన్, మార్చి 12 (ఆంధ్ర జ్యోతి) : వ్యవసాయ దాని అనుబంధ రంగాల్లో పనిచేసే మహిళా కూలీలకు పురుషులతో సమా నంగా కనీస వేతనం రోజుకు రూ.850లు నిర్ణయించాలని ఏపీ వ్యవసాయ వృత్తిదారుల సంఘం బాపులపాడు మండల కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బుధవారం ఆ సంఘం మండల కో-ఆర్డినేటర్ కొత్తూరు రేఖ నాయకత్వంలో విన తిపత్రాన్ని బాపులపాడు తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ సుబ్రహ్మణ్యంకు అందజేశారు. బుడుపుల జయశ్రీ, కీర్తి, రాజ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కూలీ సంఘం నేతలు

కోడూరులో కవల దూడల జననం



కోడూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఆవు కవల దూడలకు జన్మనిచ్చిన ఘటన కోడూరు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన జనసేన నాయకుడు ఉల్లి శేషగిరిరావు ఆవు మంగళవారం రాత్రి ఒక లేగ దూడ, పెయ్యి దూడకు జన్మనిచ్చింది. ఒక దూడ ఎరుపు రంగులో మరొక దూడ తెలుపు రంగులో అందర్నీ ఆకర్షిస్తున్నాయి. దూడలు ఆరోగ్యంగా ఉన్నట్లు శేషగిరిరావు తెలిపారు.

అదృశ్యమైన వృద్ధురాలు మృతి

- 4 రోజుల క్రితం ఇంటి నుంచి ఆస్పత్రికి బయలుదేరిన బేబి
- కుమార్తె పొలంలో కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం గుర్తింపు
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



చోరగుడి బేబి(ఫైల్)

చల్లపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి వెళ్తున్నానని నాలుగు రోజుల కిందట ఇంటి నుంచి బయలుదేరిన వృద్ధురాలు బుధవారం కుమార్తె పొలంలో విగతజీవిగా కనిపించింది. వివరాల్లోకి వెళితే... పమిడిముక్కల మండలం పెనుమత్స గ్రామానికి చెందిన చోరగుడి బేబి(65)కి ఆరోగ్య సమస్యలున్నాయి. కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఉన్న ఆమె చల్లపల్లి మండలం రామానగరంలోని ఆర్‌ఎంపీ డాక్టరు దగ్గరకు మందుల కోసం గత శనివారం వచ్చి ఇంటికి తిరిగివెళ్లలేదు. దీంతో కుమారుడు చోరగుడి శ్రీనివాసరావు తల్లి గురించి పాతనడకుదురులో ఉంటున్న సోదరి, బావలను వాకబు చేయగా వారి ఇంటికి రాలేదని చెప్పారు. రామానగరం వచ్చిన బేబికి మూడు రోజులకు సరిపడా మందులు ఇచ్చి పంపానని వైద్యుడు అల్లుడికి ఫోన్ చేసి చెప్పారు. ఇంటికీ తిరిగి రాక, చెల్లి ఇంటికీ వెళ్లకపోవటంతో ఆందోళన చెందిన కుమారుడు శ్రీనివాసరావు సోమవారం చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. వృద్ధురాలి కోసం వెతికినప్పటికీ ఆచూకీ తెలియలేదు. ఇదిలా ఉండగా, బుధవారం ఉదయం పురిటిగడ్డ పరిధిలోని పొలంలో పనిచేస్తున్న కుమార్తె సీతామహాలక్ష్మి, కూలీలకు బేబి మృతదేహమై కనిపించింది. చనిపోయి రోజులు గడవటంతో మృతదేహం పూర్తిగా పాడైపోయింది. అక్కడే శవపరీక్ష నిర్వహించారు. ఆస్పత్రి నుంచి వచ్చిన వృద్ధురాలు కుమార్తె ఇంటికి వెళ్లేందుకు పొలంలో నడుచుకుంటూ వెళుతూ ఆయాసం కారణంగా పొలంలో పడి చనిపోయి ఉంటుందని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మిస్సింగ్ కేసును అనుమానాస్పద మృతిగా మార్చి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చల్లపల్లి ఎస్‌ఐ పి.ఎస్.వి.సుబ్రహ్మణ్యం తెలిపారు.

సీడ్ యాక్సెస్ రోడ్డును అందంగా తీర్చిదిద్దాలి

- ఏడీసీ చైర్‌పర్సన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీపార్థసారధి



పచ్చదనం పనులను పరిశీలిస్తున్న లక్ష్మీపార్థసారధి

ఎన్టీఆర్ కలెక్టరేట్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతి నగరానికి ప్రధాన రహదారి అయిన సీడ్ యాక్సెస్ రోడ్డును పచ్చదనంతో అందంగా తీర్చిదిద్దాలని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) చైర్‌పర్సన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీపార్థసారధి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె సీడ్ యాక్సెస్ రోడ్డుపై జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. రహదారిపై ఏర్పాటు చేసిన మొక్కల మధ్య ఖాళీలు వస్తే సూర్యరశ్మిని తట్టుకొనే శక్తివంతమైన పూల మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. వేసవి ఎండలు, వడగాలుల నుంచి మొక్కలను సంరక్షించాలని సూచించారు. డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థను ఏర్పాటు చేసి మొక్కలకు సమృద్ధిగా నీరందించాలని జైన్ ఇరిగేషన్ ప్రతినిధి జితేంద్రకు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం ఎన్-9 రోడ్డుపై బఫర్‌జోన్ అభివృద్ధి పరిచేందుకు ప్రణాళికలు రచించాలని ఉద్యాన అధికారులకు సూచించారు. ఏడీసీ నిర్మాణం చేపడుతున్న రహదార్లపై ఎక్కడా నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఏడీసీ జనరల్ మేనేజర్ కె.శ్రీహరిరావు, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, ఉద్యాన విభాగాధిపతి వి.ఎస్.ధర్మజ పాల్గొన్నారు.

బాలుడి ప్రాణాలు తీసిన షెడ్డు

- ఆడుకుంటుండగా కూలిన స్లాబ్
- ఇద్దరు బాలురకు తీవ్ర గాయాలు
- యనమలకుదురు లాకుల వద్ద ఘటన



మేడిశెట్టి తరుణ్(ఫైల్)



కూలిపోయిన మోటారు షెడ్డు

ఆటోనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థలో ఉన్న మోటార్ షెడ్డు కూలి ఓ బాలుడు మృతి చెందగా, ఇద్దరు బాలురకు తీవ్ర గాయాలైన ఘటన పటమట పోలీస్ స్టేషన్ పరిధిలోని యనమల కుదురు లాకుల వద్ద బుధ వారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. యనమల కుదురుకు చెందిన అన్నదమ్ములైన మేడిశెట్టి షణ్ముఖ్, మేడిశెట్టి తరుణ్(11), పటమట కొత్త వంతెన సెంటర్‌కు చెందిన సూరగాని హరీష్ కుమార్ పటమటలోని గోవిందరాజుల పాఠశాలలో చదువుతున్నారు. బుధవారం పాఠశాలకు వెళ్లకుండా యనమలకుదురు లాకుల సమీపంలోని ఖాళీ స్థలంలోకి ఆడుకోవడానికి వెళ్లారు. కొన్నేళ్ల కింద బావి వద్ద మోటార్ కోసం చిన్న గది ఏర్పాటు చేశారు. ముగ్గురు బాలురులు ఆడుకుంటూ ఆ షెడ్డు పైకి ఎక్కారు. ఒక్కసారిగా ఆ షెడ్డు స్లాబ్ కూలి పోయింది. ఈ ప్రమాదంలో తరుణ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. షణ్ముఖ్ ఎడమ మోకాలు, తలకు.. హరీష్‌కు ఎడమ కాలు తొడ భాగంలో విరిగింది. బాలురు అరుపులు విని స్థానికులు అక్కడకు చేరుకుని వారిని 108 సిబ్బంది సహాయంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి తరుణ్ మృతి చెందినట్లు నిర్ధారించారు. మిగిలిన ఇద్దరు బాలుర ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణవర్మ తెలిపారు. కాగా, పాఠశాలకు వెళ్లి ఉంటే ప్రమాదం తప్పేదని తల్లిదండ్రులు మేడిశెట్టి దుర్గాప్రసాద్, దివ్యలు గుండలవిసేలా రోధించారు. మేడిశెట్టి షణ్ముఖ్, చిన్న తరుణ్(11) పటమటలోని గోవిందరాజుల పాఠశాలలో 7, 6వ తరగతి చదువుతున్నారు. దుర్గాప్రసాద్ ఆటోనగర్‌లో లిఫ్ట్ మెకానిక్‌గా, దివ్య హోటల్‌లో పనిచేస్తున్నారు.

కిలోల లెక్క బాదుడు



కొండెక్కిన పుచ్చకాయల ధరలు

- కిలో రూ.30 చొప్పున విక్రయాలు
- ఐదు చిన్న ముక్కల కప్పు రూ.20
- కాయ సైజును బట్టి రూ.50 నుంచి 300 వరకు అమ్మకాలు
- తమిళనాడు రాష్ట్రం దిండివనం, రాష్ట్రంలోని నెల్లూరు, గూడూరు, కోట, కృష్ణపట్నం నుంచి దిగుమతి

వేసవి రాకముందే పుచ్చకాయల వ్యాపారం జోరందుకుంది. రెండు నెలల ముందు నుంచే మార్కెట్‌లోకి పుచ్చకాయలు వస్తున్నాయి. ఎండలు ముదరటంతో జనం పుచ్చకాయల కొనుగోలుపై ఆసక్తి చూపుతున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు ధరలు పెంచేశారు. కిలో రూ.30 అని బోర్డులు తగిలించారు. ఐదు కిలోల కాయ కొనాలంటే రూ.150 చెల్లించాల్సి వస్తోంది. ప్రస్తుతం పుచ్చకాయల ధరలు చూసి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

ఆంధ్రజ్యోతి-విద్యాధరపురం: మార్కెట్‌లో ప్రస్తుతం పుచ్చకాయలు ధరలు బెంబేలెత్తిస్తున్నాయి. ఇది వరకు వలే కాయ మొత్తం ఖరీదు కాకుండా కిలోల లెక్కన అమ్మటంతో కొనలేని పరిస్థితి నెలకొంది. సహజంగా నీటి కంటెంట్ ఎక్కువగా ఉండే పుచ్చకాయ బరువులో కూడా అధికంగానే ఉంటుంది. సుమారుగా ఎంత చిన్న కాయను తీసుకున్నా కిలోన్నర నుంచి రెండు కిలోల వరకు తూకం తూగుతుంది. దీంతో ఒక చిన్న పుచ్చకాయను రూ.60 నుంచి ఇంకా ఆపైన ధర పెట్టి కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. సుమారు 5 కిలోల బరువు ఉన్న కాయను రూ.150 కొనాలంటే చాలా మంది వెనకకు తగ్గుతున్నారు. గతంలో ఐదు కిలోల కాయను సుమారుగా రూ.60 నుంచి రూ.100 లోపు అమ్మేవారు. ఇప్పుడు కిలోల లెక్కన ఖరీదు కట్టి బాదుతున్నారు. ఏదైనా అడిగితే అన్నీ పెరిగాయ్ అంటూ ఒక మాట చెప్పేస్తున్నారు.

పుచ్చకాయలో పోషక విలువలు

పుచ్చకాయ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. కేలరీలు, ఫ్యాట్, కొలెస్ట్రాల్, సోడియం, కార్బొహైడ్రేట్స్, ఫైబర్, విటమిన్ సి, పొటాషియం, క్యాల్షియం, విటమిన్ ఎ తదితరాలు సమపాళ్లలో పుచ్చకాయలో ఉంటాయి. చాలా ప్రాంతాల్లో పుచ్చకాయకు గిరాకీ ఉంది. అన్ని రకాలుగా దేహానికి ఆరోగ్యం ఇవ్వటంతో దీని ప్రాధాన్యం పెరిగింది. బెజవాడకు పుచ్చకాయలు తమిళనాడు రాష్ట్రం దిండివనం నుంచి కొనుగోలు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో నెల్లూరు, చప్పిడి, గూడూరు, కోట, కృష్ణపట్నం, కావలి, తెలంగాణ రాష్ట్రం భద్రాచలం నుంచి కూడా దిగుమతి అవుతున్నాయి. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో జోరుగా విక్రయాలు సాగుతున్నాయి.

టన్ను రూ.10 వేల నుంచి 18 వేల వరకు పడుతోంది



పుచ్చకాయ పంట తమిళనాడు రాష్ట్రం దిండివనంలో అధికంగా సాగవుతుంది. అక్కడి నుంచి కొనుగోలు చేస్తున్నాం. ప్రస్తుతం టన్ను ధర రూ.10 వేల నుంచి రూ.18 వేల వరకు ధర పలుకుతోంది. గతంలో కంటే ప్రస్తుతం ధరలు పెరిగాయి. పుచ్చకాయ సైజును బట్టి రూ.50 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నాం. కేజీ పుచ్చకాయ ధర రూ.30 ఉంది.
- కుమారస్వామి, పుచ్చకాయల వ్యాపారి

వైసీపీ నాయకులు రోడ్డెక్కితే బయటపడేది వారి అరాచకాలే

- స్టేటస్‌కో ఇచ్చిన వైసీపీ కార్యాలయంలో ఎలా కార్యక్రమాలు నిర్వహిస్తారు
- విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకువస్తున్న మంత్రి లోకేశ్
- జగన్‌రెడ్డి ఫీజుల బకాయిలు రూ.760 కోట్లు కూటమి ప్రభుత్వం చెల్లించింది
- పేర్ని నాని ఇష్టారాజ్యంగా మాట్లాడటం హాస్యాస్పదం
- మంత్రి కొల్లు రవీంద్ర



మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు రోడ్డెక్కితే బయటపడేది వారి అరాచకాలేనని, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై మాజీ మంత్రి పేర్ని నాని మాట్లాడటం హాస్యాస్పదమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. మచిలీపట్నం టీడీపీ అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కొట్టేసిన పేర్ని నాని ఒక్కసారి జీవో 340 చదువుకోవాలన్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టినందున కోర్టులో కేసులు నడుస్తున్నాయని, స్టేటస్‌కో ఉన్న సమయంలో వైసీపీ కార్యాలయంలో కార్యక్రమాలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. పార్టీ కార్యాలయం పేరుతో రూ.50 కోట్ల విలువైన భూమిని కొట్టేయడం దుర్మార్గమన్నారు. 340 జీవో ప్రకారం ఏడాది కాలంలో నిర్మాణం చేపట్టాలని, అయితే వైసీపీ కార్యాలయం ఏడాదిలో నిర్మాణం చేపట్టలేదన్నారు. ఐదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు దొంగ జీవోలు, దొంగ ఆదేశాలతో రాష్ట్రాన్ని లూటీ చేశారన్నారు. రూ.40 కోట్లతో బందరుకు వన్నె తెచ్చిన పట్టాభి సీతారామయ్య మెమోరియల్ భవనం నిర్మించేందుకు పేర్ని నాని అడ్డుపడ్డారని, మునిసిపల్ కౌన్సిల్ తీర్మానం చేయనివ్వలేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై రూ.750 కోట్ల బకాయిలు చెల్లించామన్నారు. విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నారన్నారు. మెరుగైన విద్యను అందించేలా విశ్వవిద్యాలయాల్లో గణనీయమైన మార్పులు చేపడుతున్నారన్నారు. ఫీజులు నేరుగా కళాశాలలకు ఇవ్వడం వల్ల సర్టిఫికెట్లను కళాశాలలు ఆపలేవన్నారు. రోడ్డెక్కి మాట్లాడితే వైసీపీ నాయకుల పరువేపోతుందన్నారు. ఏ కాలేజీకి కూడా బకాయిలు లేకుండా చర్యలు తీసుకుంటామని, విద్యార్థులకు అన్యాయం చేయబోమన్నారు.

అసెంబ్లీకి వస్తే జగన్‌రెడ్డి బండారం బయటపడుతుందనే..

అసెంబ్లీకి వచ్చి జగన్‌రెడ్డి మాట్లాడితే బండారం మొత్తం బయట పడుతుందనే భయంతో అసెంబ్లీకి రాకుండా వీధుల్లో డ్రామాలాడుతున్నారన్నారు. అధికారులను పేర్ని నాని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. డ్రెయిన్లు, ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలు తొలగించడం వల్ల నగర ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. బడ్డీలను నిలువరించే విద్యావంతులకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. వైసీపీ నాయకులు బడ్డీలు పెట్టి అద్దెలకు ఇచ్చుకున్నారన్నారు. మచిలీపట్నం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. మూడు నెలలు అడ్రస్ లేకుండా బియ్యం దొంగ పేర్ని నాని పారిపోయారని, బెయిల్ రావడంతో మళ్లీ రోడ్డు మీద కనబడుతున్నారన్నారు. పేర్ని నానిపై సిట్‌ను నియమించామన్నారు. బెయిల్ వచ్చినంత మాత్రాన పేర్ని నాని చట్టం నుంచి తప్పించుకోలేరన్నారు.

పేదల గృహ నిర్మాణానికి అదనపు సాయం

- ఆర్డీవో చైతన్య

బెంజిసర్కిల్, మార్చి12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన విధానం ద్వారా నిరుపేదల గృహ నిర్మాణానికి అదనపు సాయం అందనుందని ఆర్డీవో చైతన్య చెప్పారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పెరిగిన ఖర్చులతో ఇబ్బందిపడుతున్న లబ్ధిదారులకు ప్రభుత్వం సాయం అందజేస్తుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకొని గృహ నిర్మాణలను పూర్తి చేసుకోవాలని కోరారు. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులకు కూడా అవగాహన కల్పించేందుకు ఈ నెల 15 నుంచి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో విస్తృత అవగాహన సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ. 50వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ. 75వేలు, పీవీటీజీ(పర్వత ప్రాంత షెడ్యూల్ తెగలు)లకు రూ.లక్ష అదనపు సహాయం అందుతుందని వివరించారు.

నోరి దత్తాత్రేయుడిని కలిసిన ఐఎంఏ నేతలు



మచిలీపట్నం టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు నోరి దత్తాత్రేయుడు బుధవారం మచిలీపట్నంలోని అక్క ఇందిర, బావ ఎల్.ఎస్. శాస్త్రి ఇంటికి వచ్చారు. ఆయన్ను ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బి.శ్రీనివాసాచార్య, బందరు ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ కె.వి.శివప్రసాద్, సాయి ప్రసాద్ కలిశారు. రాజధాని అమరావతిలో నిర్మించనున్న క్యాన్సర్ ఆస్పత్రి గురించి చర్చించుకున్నారు. నోరి దత్తాత్రేయుడు మాట్లాడుతూ ఇక తరచూ అమెరికా నుంచి విజయవాడ, మచిలీపట్నం వస్తానన్నారు. తాను రచించిన మంటాడ టూ మన్‌హటన్‌ను ప్రతి ఒక్కరూ చదవాలని వివరించారు.

వాగు పోరంబోకు స్థలం కబ్జాకు యత్నం

- పాతపాడులో ఇరువర్గాల ఘర్షణ.. పోలీసులకు ఫిర్యాదు
- స్థల వివాదంలో తలదూర్చిన సస్పెక్ట్ షీటర్
- ఆ స్థలం పంచాయతీదే అంటున్న ఈవో



కబ్జాకు గురవుతున్న వాగు పోరంబోకు స్థలం

విజయవాడ రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ మండలం పాతపాడు గ్రామంలో వాగు పోరంబోకు స్థలం కబ్జాకు గ్రామానికి చెందిన కొందరు ప్రయత్నించారు. పంచాయతీ స్థలంలో మట్టితో చదును చేసి ఆక్రమించేందుకు పూనుకున్నారు. అయితే సదరు స్థలంలో తాము ఎప్పటి నుంచో సాగు చేసుకుంటున్నామని, ఆ స్థలం తమదే అంటూ మరో వర్గం అక్కడికి చేరుకోవడంతో మంగళవారం రాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. అనంతరం ఇరువర్గాలు నున్న రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే... పాతపాడు గ్రామం శివారుల్లోని మంచినీటి చెరువు పక్కన పంచాయతీకి చెందిన 15 సెంట్ల వాగు పోరంబోకు భూమి ఉంది. అందులో ఇప్పటికే ఎనిమిది సెంట్ల వరకు ఆక్రమణలు జరిగి నిర్మాణాలు కూడా చేపట్టేశారు. అయితే మిగిలిన ఏడు సెంట్ల ప్రభుత్వ స్థలంపై కన్నేసిన గ్రామానికి చెందిన కొందరు సదరు స్థలంలో మట్టి కొట్టించి చదును చేసి ప్లాట్లుగా విభజించేందుకు ప్రయత్నించారు. అయితే అదే ప్రాంతానికి చెందిన మరో వర్గం అక్కడికి చేరుకుని ఆ స్థలంలో తాము 15 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని, స్థలం తమదే అని చెప్పడంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. అనంతరం రెండు వర్గాలకు చెందిన వారు ఘర్షణ పడి నున్న రూరల్ పోలీసులకు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు.

ఒక వర్గానికి కొమ్ముకాసిన సస్పెక్ట్ షీటర్

అయితే కబ్జా వ్యవహారంలో ఓ సస్పెక్ట్ షీటర్ తలదూర్చాడు. కబ్జాకు ప్రయత్నించిన ఓ వర్గానికి చెందిన వారికి మద్దతుగా నున్న పోలీస్ స్టేషన్‌లో సస్పెక్ట్ షీటర్‌గా ఉన్న పేటేటి కిషోర్ వాగు పోరంబోకు స్థలంలోకి వచ్చి మరో వర్గంతో ఘర్షణపడినట్లు సమాచారం. అక్కడి వారిని బెదిరింపులకు గురి చేసినట్లు తెలుస్తోంది.

అది పంచాయతీ స్థలమే : ఈవో

స్థలం వివాదంపై పంచాయతీ ఈవో కోటి లింగమ్మను వివరణ కోరగా సదరు స్థలం వాగు పోరంబోకు స్థలమే అని ఆమె నిర్ధారించారు. ఇరువర్గాలకు ఏ విధమైన హక్కు లేదని తెలిపారు. ఈ విషయం తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని వివరించారు.

పాత ధ్వజస్తంభం తొడుగు వేలం వాయిదా

తోట్లవల్లూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రొయ్యూరు శ్రీసకలేశ్వరస్వామి దేవస్థానం ఈవో సుపద్మదేవి మరోసారి వివాదస్పద నిర్ణయం తీసుకుని బుధవారం తలపెట్టిన పాత ధ్వజ స్తంభం తొడుగు బహిరంగ వేలాన్ని వాయిదా వేశారు. పాత ధ్వజస్తంభం తొడుగు 12వ తేదీన ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం లేదా సీల్డు టెండర్ నిర్వహిస్తామని దేవస్థానం ప్రహరీ గోడపై వేలం ప్రకటన నోటీసు అంటించారు. ఈ మేరకు ప్రచారం జరిపారు. బుధవారం దేవస్థానానికి పలువురు వ్యక్తులు వచ్చి తిరిగి వెళ్లారు. వేలంపై ఈవో సుపద్మదేవిని వివరణ కోరగా వేలం వాయిదా వేశామని చెప్పారు.

అన్నీ వివాదాస్పదమే :

ఈవో సుపద్మదేవి చర్యలు వివాదాస్పదంగా మారాయి. సకలేశ్వరస్వామి దేవస్థానం జీర్ణోద్ధరణకు చేరటంతో గత వైసీపీ ప్రభుత్వంలో నూతన దేవాలయం నిర్మాణానికి దేవాదాయశాఖ సర్వశ్రేయో నిధి నుంచి రూ.75 లక్షలు కేటాయించారు. 2023లోనే దేవస్థానం నిర్మాణం ప్రారంభించగా కాంట్రాక్టర్ పనులు పూర్తిచేయలేదని నాటి అధికార వైసీపీ నేతలను తెరమీదకు రప్పించి దేవస్థానం అభివృద్ధి కమిటీని అనధికారికంగా నియమించి భారీగా విరాళాలు సేకరించినట్టు ఆరోపణలు వచ్చాయి. పైకి ఆ సమయంలో తాను సెలవులో ఉన్నట్టు చెపుతారు. ఈ విరాళాలపై ఉన్నతాధికారులకు స్థానిక బీసీ నాయకుడు లుక్కా వెంకట శ్రీనివాసరావు ఫిర్యాదు కూడా చేశారు. 2024లో సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లో ఉండగానే ఆలయాన్ని ప్రారంభింపచేయటం వివాదంగానే మారింది.





రొయ్యూరు నుంచి ఏనుగులకోడు డ్రెయిన్ వరకు రూ.కోటితో వేసిన తారురోడ్డు

తీరిన రహదారి కష్టాలు

- రూ.కోటితో తారురోడ్డుగా అభివృద్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న రొయ్యూరు వాసులు

తోట్లవల్లూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : రొయ్యూరు ప్రజలకు రహదారి కష్టాలు తీరాయి. రొయ్యూరు నుంచి కంకిపాడు వెళ్లే పంచాయతీ రోడ్డును గత వైసీపీ ఐదేళ్ల పాలనలో తీవ్ర నిర్లక్ష్యం చేశారు. రొయ్యూరులో ఇసుక క్వారీలతో వందల కోట్లు సంపాదించినప్పటికీ ప్రధాన రహదారికి ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవటంతో కనీసం గుంతలు కూడా పూడ్చలేకపోయారు. ఇసుక లారీల వల్ల రోడ్డు పెద్దపెద్ద గోతులు ఏర్పడి ఆటోలు, ద్విచక్ర వాహనాలు, బస్సులు నడవలేని పరిస్థితి ఏర్పడింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా రొయ్యూరు రోడ్డు అభివృద్ధిపై దృష్టిసారించి ఉపాధి హామీ నిధులు రూ. కోటి కేటాయింపజేశారు. గతేడాది డిసెంబరు 2వ తేదీన రొయ్యూరు వద్ద ఎమ్మెల్యే కుమార్ రాజా శంకుస్థాపన చేశారు. రొయ్యూరు నుంచి ఏనుగులకోడు డ్రెయిన్ వరకు గల 1.214 కిలో మీటర్ల రోడ్డుని బీటీ రోడ్డుగా అభివృద్ధి చేశారు. ఏనుగులకోడు డ్రెయిన్ నుంచి గొడవర్రు వరకు రోడ్డును డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో రూ.3 కోట్లతో గత నెలలో అభివృద్ధి చేశారు. దీంతో రొయ్యూరు నుంచి కంకిపాడు వరకు ఉన్న ఆరు కిలో మీటర్ల రోడ్డు అభివృద్ధి చేయటంతో రహదారి కష్టాలు తీరాయని ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాజధాని అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ)లో ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వం పోస్టింగ్‌లు ఇచ్చింది. సీఆర్‌డీఏ డిప్యూటీ కలెక్టర్ - 4 గా ఎన్‌ఎస్ వీబీ వసంతరాయుడు, గ్రీవెన్స్ రిడ్రసల్ మేనేజ్‌మెంట్ నోడల్ ఆఫీసర్‌గా పీ జయశ్రీని నియమించింది.

జీవిత సమతుల్యత ముఖ్యం

- ఎన్టీఆర్‌జిల్లా పోలీస్ కమిషనరేట్ అడ్మిన్ డీసీపీ సరిత

విజయవాడ, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : ఆధునిక యుగంలో మహిళలు అన్ని రంగాల్లోను రాణిస్తున్నందున జీవిత సమతుల్యతపై దృష్టిపెట్టాలని ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ అడ్మిన్ డీసీపీ సరిత అన్నారు. కృష్ణాజిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సమితి ఆధ్వర్యంలో విజయవాడ ఎంబీవీకేలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బ్యాంకుల్లో పనిచేసే మహిళలు ఒత్తిడికి గురికాకుండా దాన్ని జయించాలని చెప్పారు. పిల్లలను బాధ్యతయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఓల్గా దేవి, జి.సుధ, పూర్ణశోభ, ఏఐబీఈఏ కార్యదర్శి బీఎస్ రాంబాబు, గుంటూరు జీజీహెచ్ వైద్యురాలు డాక్టర్ చంద్రరాధికారాణి తదితరలు పాల్గొన్నారు.

ప్రతి హాస్టల్‌కు సీసీ కెమెరాలు తప్పనిసరి

కమిషనరేట్ పరిధిలోని ప్రతి మహిళా హాస్టల్‌లో భద్రతా చర్యలు ఉండాలని డీసీపీ సరిత స్పష్టం చేశారు. అమ్మాయిలు, మహిళల భద్రత కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హాస్టళ్ల నిర్వాహకులతో విజయవాడలోని కమిషనర్ కార్యాలయంలో ఆమె బుధవారం సమావేశం నిర్వహించారు. పని చేయని కెమెరాలను వెంటనే బాగు చేయించాలని చెప్పారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	95, 102, 112
చికెన్ విత్ స్కిన్	180
చికెన్ స్కిన్‌లెస్	190

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

16న టీడీపీ అగ్నికుల క్షత్రియ ప్రతినిధుల సమావేశం

అవనిగడ్డ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలపై అగ్నికుల క్షత్రియులకు అవగాహన కల్పించేందుకు, వృత్తిపరమైన సమస్యలను గుర్తించేందుకు ఈనెల 16వ తేదీ ఉదయం 10 గంటలకు టీడీపీ అవనిగడ్డ నియోజకవర్గ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నామని టీడీపీ బీసీ ఫెడరేషన్ అగ్నికుల క్షత్రియుల విభాగం జిల్లా కన్వీనర్ లకనం నాగాంజనేయులు తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశానికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా విచ్చేస్తారని తెలిపారు. పార్టీలోని వివిధ హోదాల్లో పనిచేసే అగ్నికుల క్షత్రియ ప్రతినిధులు అందరూ హాజరై, అభిప్రాయాలు తెలపాలని ఆయన సూచించారు.

వైసీపీ కార్యాలయం వద్ద పేర్ని నాని హల్‌చల్ చేయడం విడ్డూరం

- కార్యాలయ వ్యవహారం న్యాయస్థానంలో ఉంటే కార్యక్రమాలు ఎలా నిర్వహిస్తారు?: టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు మాదివాడ వెంకట నరసింహారావు

మచిలీపట్నం టౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ కార్యాలయ వ్యవహారం న్యాయస్థానం పరిధిలో ఉంది. తుదితీర్పు వచ్చే వరకు అక్కడ ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించకూడదు. అయినా వైసీపీ కార్యాలయం వద్ద మాజీ మంత్రి పేర్ని నాని, తన అనుచరులతో హల్‌చల్ చేశారు. ఇది విడ్డూరంగా ఉంది.' అని టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు మాదివాడ వెంకట నరసింహారావు అన్నారు. బుధవారం శిడింబి అగ్రహారంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యాలయం వద్ద కార్యక్రమాలు నిర్వహించొద్దన్న అధికారులపై పేర్ని నాని ఇష్టారాజ్యంగా మాట్లాడటం సరికాదన్నారు. గతంలో మునిసిపల్ కమిషనర్ చంద్రయ్యపై ఒత్తిడి తెచ్చి ఆయనను జైలుకు పంపేలా చేశారన్నారు. రెవెన్యూ అధికారి వెంకటేష్‌ను సస్పెండ్ చేయించేందుకు మునిసిపల్ కమిషనర్‌పై పేర్ని నాని ఒత్తిడి తీసుకొచ్చింది నిజమా..కాదా అని నిలదీశారు. అధికారులను బెదిరించి వైసీపీ కార్యాలయం నిర్మాణం కోసం అగమేఘాల మీద కౌన్సిల్‌లో తీర్మానం చేయించారన్నారు. అప్పట్లో ఎంపీ బాలశౌరి చెప్పినప్పటికీ మునిసిపల్ కౌన్సిల్‌లో భోగరాజు పట్టాభి సీతారామయ్య భవన నిర్మాణానికి ఎన్వోసీ ఇచ్చేందుకు తీర్మానం చేయలేదన్నారు. టీడీపీ జిల్లా ప్రచార కార్యదర్శి పి.వి.ఫణికుమార్, గంజాల రవికుమార్, కొనకళ్ల భాను పాల్గొన్నారు.



కలెక్టరేట్‌కు ర్యాలీగా తరలి వెళుతున్న వైసీపీ నాయకులు

నగరంలో వైసీపీ నాయకుల ర్యాలీ

మచిలీపట్నం టౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలంటూ బుధవారం రామానాయుడు పేట సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు వైసీపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మాజీ ఎమ్మెల్యేలు కైలే అనిల్‌కుమార్, సింహాద్రి రమేష్, జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, రాము, మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, కార్పొరేటర్లు శీలం భారతి, రామిశెట్టి వాణిశ్రీ, గూడవల్లి నాగరాజు, లంకా సూరిబాబు, మేకల సుబ్బన్న పాల్గొన్నారు.

జగన్ ఇంటి ముందు నిరసన తెలపండి

- వైసీపీ నేతలకు తెలుగుయువత నేత బెజవాడ నాగరాజు సూచన

పెడన, మార్చి 12(ఆంధ్రజ్యోతి): 'జగన్ ముఖ్యమంత్రిగా ఉండగా విద్యార్థులకు రూ.4వేల కోట్ల ఫీజు బకాయిలు చెల్లించలేదు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదు. ఐదేళ్ల పాటు యువతకు ఉద్యోగాలు లేకుండా చేశారు. యువతను మోసగించింది చాలక యువత పోరుబాట పేరుతో వైసీపీ కార్యక్రమం నిర్వహించడం సిగ్గుచేటు. విద్యార్థులను మోసం చేసిన జగన్ ఇంటి ముందు వైసీపీ నాయకులు నిరసన తెలపాలి.' అని తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బెజవాడ నాగరాజు విమర్శించారు. వైసీపీ ప్రభుత్వంలోని ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించిందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.2832 కోట్లు, వసతి దీవెన బకాయిలు రూ.989 కోట్లు, పీజీ ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.450 కోట్లు బకాయి పెట్టిందని ఆయన ఆరోపించారు.

సబ్సిడీపై మ్యాంగో కవర్లు

అవనిగడ్డ , మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఉద్యానశాఖ ద్వారా మామిడి రైతులకు మ్యాంగో కవర్లు సబ్సిడీపై అందిస్తున్నామని ఉద్యానశాఖాధికారి ఎన్.రమేష్ తెలిపారు. బుధవారం మామిడితోటలను ఆయన పరిశీలించారు. కవర్ల వాడకం ద్వారా కాయతొలుచు పురుగు, తెగుళ్ల నివారణ జరుగుతుందన్నారు. అధిక ధర పలుకుతుందని, కాయ నాణ్యత ఉంటుందని పెట్టుబడి తగ్గుతుందని తెలిపారు. ప్రతి రైతుకు గరిష్ఠంగా హెక్టారుకు 10 వేల కవర్లు అందజేస్తామని, కవరు ఖరీదు రూ.2 ఉంటుందని తెలిపారు. సబ్సిడీ రూపాయి పోనూ ఎకరానికి రూ.10 వేలు ఖర్చు అవుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈనెల 25వ తేదీలోపు వ్యవసాయ, ఉద్యాన సహాయకులను సంప్రదించాలని కోరారు.



మామిడి తోటలను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి రమేష్

లయోలా యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

మచిలీపట్నం టౌన్, మార్చి 12(ఆంధ్ర జ్యోతి): ఆంధ్రా లయోలా కళాశాలకు అటానమస్ హోదా ఉందని విద్యార్థులను మోసగిస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కేయూ ఉపకులపతి రాంజీ, విశ్వవిద్యాలయం రెక్టార్ ఎం.వి.బసవేశ్వరరావుకు బుధవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) రాష్ట్ర కార్యదర్శి వెంకటగోపి వినతిపత్రం సమర్పించారు. లయోలా కళాశాలకు అటానమస్ హోదా పోయి మూడేళ్లు అవుతుందని, యాజమాన్యం హోదా ఉందని విద్యార్థులను మోసగిస్తోందని, దీనిపై ఎంక్వయిరీ కమిషన్ వేసి చర్యలు తీసుకోవాలని వెంకట గోపి కోరారు. ఏబీవీపీ రాష్ట్ర కన్వీనర్ మాదిరెడ్డి సుబ్రహ్మణ్యం, నాయకులు వరుణ్‌కోటి, పవన్‌కుమార్, ధనరాజ్, మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.



కేయూ వీసీ రాంజీకి వినతిపత్రం అందిస్తున్న ఏబీవీపీ నాయకులు

ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులు

పెడన, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మారుతున్న విద్యా సంస్కరణలకు అనుగుణంగా బోధనలో మెళకువలు నేర్చుకోవాలని, నిత్య విద్యార్థులుగా ఉంటేనే ఉపాధ్యాయులు మంచిగా బోధన చేయగలరని సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎం.ఫణిధూర్జటి అన్నారు. నందమూరు జడ్పీ హైస్కూల్‌లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం జరుగుతున్న తీరును బుధవారం ఆయన పరిశీలించారు. భవిష్యత్తులో ఉపాధ్యాయులకు ఎటువంటి శిక్షణ అవసరమో ఉపాధ్యాయుల నుంచి ఆయన అభిప్రాయాలు సేకరించారు. క్లస్టర్ రిజిస్టర్లు, రికార్డులను ఆయన తనిఖీ చేశారు. ఎంఈవో-2 వైవీ హరనాథ్, సెక్టోరల్ అధికారులు రమేష్, రాంబాబు, రామకృష్ణ పాల్గొన్నారు.



కాంప్లెక్స్ రికార్డులు పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఫణిధూర్జటి

ఆదర్శ గ్రామం బొబ్బర్లంక

- గడువుకు ముందే నూరు శాతం పన్ను వసూళ్లు

(ఆంధ్రజ్యోతి-మోపిదేవి): గ్రామాల అభివృద్ధికి ఇంటి పన్నుల వసూళ్లే ప్రామాణికమని చెబుతున్న ప్రభుత్వ సూచనలను బొబ్బర్లంక గ్రామస్థులు అమలు చేశారు. నూరుశాతం ఇంటి పన్నులు చెల్లించి మండలానికే ఆదర్శంగా నిలిచారు. ప్రభుత్వం మార్చి 31వ తేదీ కల్లా నూరుశాతం ఇంటి పన్నులు చెల్లించాలని లక్ష్యంగా నిర్ణయించింది. దీంతో పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని సర్పంచ్ దొప్పలపూడి గంగాభవాని, పంచాయతీ కార్యదర్శి కె.రామకోటేశ్వరరావు గ్రామస్థులను కోరారు. గ్రామాభివృద్ధికి సహకరిస్తామంటూ గ్రామస్థులు ఇంటి పన్నులను సకాలంలో చెల్లించారు. బొబ్బర్లంకలో 254 గృహాలు ఉండగా, ఇతరత్రా చిరు వ్యాపారులు ఉన్నారు. గృహాలకు రూ.1,43,229, చిరువ్యాపారులు రూ.28,645, గ్రంథాలయ పన్ను రూ.11,459, లైటింగ్ చార్జ్ రూ.14,335, స్పోర్ట్స్‌కు రూ.4292, ఫైర్ ట్యాక్స్ రూ.1431, నాన్ టాక్సెస్ రూ.11,400 కలిపి మొత్తం రూ.2,42,366 చెల్లించారు. ఇప్పటికే నూరుశాతం ఇంటి పన్నులు వసూళ్లు చేసి పంచాయతీ ఖాతాకు జమ చేశారు. మండలంలో 13 గ్రామపంచాయతీలు ఉండగా, నూరుశాతం ఇంటి పన్నులు వసూలు చేసి బొబ్బర్లంక ప్రథమ స్థానంలో నిలిచింది. వెంకటాపురం గ్రామం 33 శాతం వసూలు చేసి, ఆఖరి స్థానంలో ఉంది.



సహకరించిన గ్రామస్థులకు ధన్యవాదాలు

నూరుశాతం పన్నుల చెల్లింపులో ప్రభుత్వానికి సహకరించిన బొబ్బర్లంక గ్రామ ప్రజలకు ధన్యవాదాలు. ప్రజలు సహకరించినట్టే గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపి మండలంలోనే మరింత ఆదర్శంగా నిలుపుతాం.

- కె.రామకోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి

నాలుగేళ్లుగా నూరు శాతం వసూళ్లు

నాలుగేళ్లుగా బొబ్బర్లంక గ్రామం నూరుశాతం పన్ను వసూళ్లు చేస్తోంది. మండలంలో ఆదర్శవంతంగా నిలుస్తోంది. జిల్లా పంచాయతీ అధికారి, మండల అధికారుల సూచనలతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. ప్రజల సహకారంతో నూరుశాతం పన్నులు వసూలు చేస్తున్నాం.

- దొప్పలపూడి గంగాభవాని, సర్పంచ్



సుబ్బారాయుడి సేవలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

మోపిదేవి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామిని దర్శించుకున్నాక అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికారు. ఆలయ పర్యవేక్షకుడు మధుసూదనరావు స్వామి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.



ప్రసాదాన్ని ఎమ్మెల్యే చినరాజప్పకు అందిస్తున్న ఆలయ పర్యవేక్షకుడు

ప్లాస్టిక్ రహిత నగరంగా బందరును తీర్చిదిద్దుదాం

- చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో కమిషనర్ బాపిరాజు

మచిలీపట్నం టౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత నగరంగా బందరును తీర్చిదిద్దుదామని మునిసిపల్ కమిషనర్ బాపిరాజు పిలుపునిచ్చారు. బుధవారం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో మునిసిపల్ కార్యాలయ సమావేశపు హాలులో నిర్వహించిన సమావేశంలో అధికారులతో బాపిరాజు మాట్లాడారు. ప్లాస్టిక్ వస్తువులు, క్యారీబాగ్‌లు, డిస్పోజల్ గ్లాసులు, ప్లాస్టిక్ లామినేషన్ ఉండే అట్ట టీ గ్లాసుల వాడకం మంచిది కాదని, వీటిని నిషేధించాలని కోరారు. ఇందుకు వ్యాపార, వాణిజ్యవేత్తలు సహకరించాలన్నారు. ఈ వస్తువుల అమ్మకాలకు ప్రత్యామ్నాయం చూపాలని చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు కోరారు. పెనాల్టీలలు పడకుండా వ్యాపార వర్గాలు సహకరించాలని చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు మద్దుల గిరీష్ కోరారు. చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా కార్యదర్శి పల్లపోతు సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ బాపిరాజు

ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

పెడన, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉప్పాల రాము ఆధ్వర్యంలో పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో బుధవారం వైసీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కేకు కట్ చేశారు. తదనంతరం మచిలీపట్నంలో కలెక్టర్ కార్యాలయం వద్ద తలపెట్టిన యువత పోరుబాట కార్యక్రమానికి ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, నాయకులు కటకం ప్రసాద్, బండారు మల్లి, బళ్ల గంగయ్య, రాజులపాటి అచ్యుతరావు, గరికపాటి రామానాయుడు, బొడ్డు శ్యామల, మైలా రత్నకుమారి, తిరుమాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విస్తరణ సహ సంచాలకురాలు డాక్టర్ వి.విశాలాక్షి

మినుము, వరి నూతన రకాలను అందుబాటులోకి తేవాలి

ఘంటసాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మినుము, వరి నూతన రకాలను అందుబాటులోకి తేవాలని శాస్త్రవేత్తలకు విస్తరణ సహ సంచాలకురాలు డాక్టర్ వి.విశాలాక్షి సూచించారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం సహ పరిశోధనా సంచాలకురాలు ఇన్‌చార్జి డాక్టర్ విశైలజ అధ్యక్షతన శాస్త్రీయ సలహా మండలి సమావేశం కేవీకే ప్రొగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతులతో విశాలాక్షి చర్చాగోష్టి నిర్వహించారు. కేవీకే తరఫున రెండు కరపత్రాలను విడుదల చేశారు. కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ సుధారాణి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మనోహర్, జిల్లా ఉద్యాన అధికారి జె.జ్యోతి, సీనియర్ శాస్త్రవేత్తలు సత్యప్రియ లలిత, నాగేంద్రరావు, ఆత్మ డైరెక్టర్ నరసింహారావు, జిల్లా వనరుల కేంద్రం తరఫున కె.జ్యోతిరమణి పాల్గొన్నారు.

గీత కార్మికులకు అండగా కూటమి ప్రభుత్వం

కోడూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): గీత కార్మికులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి అన్నారు. తాడిచెట్టుపై నుంచి పడి ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్న మోర్ల కోటేశ్వరరావును స్వతంత్రపురంలోని ఇంటి వద్ద బుధవారం ఆయన పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చిరుసాయం అందించారు. గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామ ప్రసాద్, టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ పాల్గొన్నారు.

వైభవంగా కనకదుర్గమ్మ ఆలయ పునఃప్రతిష్ఠ

అవనిగడ్డ రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పులిగడ్డలో కనకదుర్గమ్మ ఆలయ పునఃప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్- విజయలక్ష్మి దంపతులు, యువ నాయకుడు మండలి వెంకట్రామ్, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌దేవనబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ముందుగా శిఖర ప్రతిష్ఠ, జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం యాగశాలలో మహాపూర్ణాహుతి సమర్పించారు. అతిథులను ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, ఆలయ పెద్దలు సత్కరించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మండలి వెంకట కృష్ణారావు(బాబు) పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దంపతులు



పూజలో పాల్గొన్న పదో తరగతి విద్యార్థులు, తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, ఉపాధ్యాయులు

కానూరు హైస్కూల్‌లో సరస్వతి పూజ

మచిలీపట్నం టౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పరీక్షలు బాగా రాసి పదోతరగతి విద్యార్థులందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులవ్వాలని తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ ఆకాంక్షించారు. బుధవారం కానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సత్యసేవా సమితి ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు సరస్వతి పూజ నిర్వహించారు. పోతుకూచి ఆంజనేయకుమార్, విద్యా కమిటీ చైర్మన్ ఈవన ఏసు పాల్గొన్నారు. గోపు సత్యనారాయణ ప్యాడ్లు, పెన్నులు అందజేశారు.

ప్యాడ్లు, పెన్నుల పంపిణీ

నాగాయలంక: లలితాదేవి ట్రస్టు(చల్లపల్లి) ఆధ్వర్యంలో భావదేవరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష రాసే విద్యార్థులు 40 మందికి ప్యాడ్లు, పెన్నులు వితరణ అందించారు. సర్పంచ్ మండలి ఉదయ భాస్కర్, ట్రస్టు చైర్మన్ ఎంవీ కృష్ణారావు, హెచ్‌ఎం జ్యోతిర్మయి పాల్గొన్నారు.

- నాగాయలంకలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 123 మందికి అవనిగడ్డ ఎస్వీఎల్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు పరీక్షా ప్యాడ్లు, ఇతర సామగ్రిని బహూకరించారు. ప్రధానోపాధ్యాయుడు వీవీఎస్వీ ప్రసాద్ పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాదులు జాన్ విక్టర్, వీరరాఘవయ్యకు నివాళి

మచిలీపట్నం టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన సీనియర్ న్యాయవాదులు గుమ్మడి జాన్ విక్టర్, పాములపర్తి వీరరాఘవయ్య చిత్రపటాలకు బుధవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో నాయకులు ఘనంగా నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బూరగడ్డ అశోక్‌కుమార్ అధ్యక్షత నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి అరుణసారిక, జిల్లా మొదటి అదనపు జడ్జి చిన్నంశెట్టి రాజు, 10వ అదనపు జిల్లా జడ్జి చినబాబు, పోక్సో కోర్టు న్యాయమూర్తి గాజుల వెంకటేశ్వరరావు, 6వ అదనపు జిల్లా కోర్టు జడ్జి ఎస్.పూర్ణిమ, కృష్ణా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రామకృష్ణయ్య, పలువురు సీనియర్ న్యాయవాదులు సీతాల ప్రసాద్, చిన్నారావు, పరసా మధుసూదనర్, మహమ్మద్ రఫీ, సింగులూరి శాంతిప్రసాద్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

మోపిదేవి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): బోడగుంటలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన కొమ్ము బ్రహ్మయ్య కుటుంబానికి ఇండియన్ రెడ్‌క్రాస్, గ్రామీణ యువజన వికాస సమితి ఆధ్వర్యంలో సహాయాన్ని అందించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ బుధవారం మండల రెడ్‌క్రాస్ ప్రతినిధులతో కలిసి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. రెడ్‌క్రాస్ సమకూర్చిన హైజనిక్ కిట్టు, వంట పాత్రలు, గ్రామీణ యువజన వికాస సమితి ఆధ్వర్యంలో దుస్తులు, రూ.5 వేలు అందజేశారు.

బోనం పాపారావు సంస్మరణ సభ

నాగాయలంక, మార్చి 12(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు బోనం పాపారావు ఇటీవల మృతి చెందగా, ఆయన సంస్మరణ సభ నాగాయలంకలోని ఆయన స్వగృహంలో బుధవారం నిర్వహించారు. పాపారావు చిత్రపటానికి మండలి వెంకట్రామ్ నివాళులర్పించారు. తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, మెండు లక్ష్మణరావు, యాసం చిట్టిబాబు, గుడివాక శివరావు, రాయపూడి వేణుగోపాలరావు పాల్గొన్నారు.

కన్నుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

మచిలీపట్నం టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గొడుగుపేటలో భూదేవి పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం బుధవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. ఆలయ ఈవో ఏవీ గోపాలరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కల్యాణ మహోత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో భూదేవి పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి



డ్రెయిన్లను పరిశుభ్రంగా ఉంచాలి

గుడివాడ, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : టిడ్కోకాలనీలోని డ్రెయినేజీల్లో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించి, మురుగునీటి పారుదలకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. మల్లాయిపాలెం శివారు టిడ్కో కాలనీలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని డ్రెయినేజీలను పరిశీలించారు. డ్రెయిన్లలో పేరుకుపోయిన చెత్త, చెదారాలను ఎప్పటికప్పుడు తొలగించాలని శానిటేషన్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.


డ్రెయినేజీని పరిశీలిస్తున్న మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు

మోడల్ రైతుబజారుగా తీర్చిదిద్దుతాం

● మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత

గుడివాడ, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : గుడివాడ రైతు బజారును రాష్ట్రంలోనే మోడల్ రైతు బబజారుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత పేర్కొన్నారు. బుధవారం గుడివాడలోని మార్కెట్‌యార్డు, రైతుబజారుల్లో తనిఖీలు చేపట్టారు. తొలుత మార్కెట్‌యార్డు కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం రైతుబజారును సందర్శించారు. రైతుబజారు స్థితిగతులను వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. గాలీ, వెలుతురు రాకుండా దుకాణాల ఎదుట పరదాలు కట్టడం, ఎక్కడపడితే అక్కడే కూరగాయలు, ఆకుకూరలను పెట్టి అమ్మకాల చేపట్టడం పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పూర్తిస్థాయిలో రైతుబజారును రీ మోడల్ చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ముఖ్యంగా కింద ఫ్లోర్లింగ్ ఎత్తు పెంచాలని, ఎటువంటి నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. బాత్‌రూమ్‌లను వెంటనే ఆధునీకరించాలన్నారు. మరమ్మతుల అవసరమున్న షెడ్డులను తొలగించాలన్నారు. వీటన్నింటికి అంచనాలు తయారు చేసి వెంటనే ప్రతిపాదనలు పంపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక రైతులతో కాసేపు ముచ్చటించారు. నాణ్యత ఎక్కువగా ఉన్న క్యాబేజీలకు అదనంగా రూ.2లు పెంచి అమ్మకాలు చేపట్టేలా చూడాలని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. రైతుబజారులో అమ్మకాలు చేసే రైతులకు తమ సరుకును నిల్వ చేసుకునేందుకు సరైన సదుపాయాలు లేవని, కనీసం భోజనం చేయడానికి కూడా చోటు లేదని రాష్ట్ర డైరెక్టర్ సునీత దృష్టికి తీసుకువచ్చారు. రెండు చోట్ల రైతుల కోసం గోడౌన్ తరహాలో ఏర్పాటుచేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్, అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.నిత్యానందరావు, డీజీ, ఏఈలు, మార్కెట్ యార్డు కార్యదర్శి భాస్కరరావు, రైతుబజారు ఈవో షేక్ అమీర్‌బాబు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ సునీత

తాగునీటి ఎద్దడి రానీయకండి

పామర్రు,మార్చి12(ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలను సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సత్యన్నారాయణ కోరారు. బుధవారం పామర్రులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడిపై గ్రామాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగునీటి సరఫరాలో ఎవైనా ఇబ్బందులుంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా రక్షిత మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో మురుగు డ్రెయినేజీల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సుబ్రమణ్యం పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ అధికారిణి విజయా ఫ్లొరెన్స్

నాణ్యమైన విద్యే లక్ష్యం

గుడివాడ రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కార్యకర్తలు పిల్లలకు చక్కటి నాణ్యమైన విద్యతోపాటు, పౌష్టికాహారాన్ని అందించాలని ఐసీడీఎస్ అధికారిణి విజయా ఫ్లొరెన్స్ అన్నారు. బుధవారం ఏజీకే పాఠశాలలో గుడివాడ రూరల్ మండలాల అంగన్వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. వారికి చక్కటి పోషక విలువల ఆవశ్యకత గురించి పిల్లల తల్లులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నసీరున్నీసా, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


కల్యాణ మహోత్సవాల సందర్భంగా పసుపు దంచుతున్న మహిళలు

ఘనంగా గ్రామోత్సవం

కూచిపూడి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కూచిపూడిలోని బాలాత్రిపుర సుందరిదేవి సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం మహిళలు శాస్త్రోక్తంగా పసుపును దంచే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎదుర్కోలు ఉత్సవం కార్యక్రమాలతోపాటు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


అన్నదానం నిర్వహిస్తున్న మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులు

అన్నక్యాంటీన్‌లో అన్నదానం

గుడివాడ, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : పెందుర్తి ప్రసాదరావు 5వ వర్థంతి సందర్భంగా స్థానిక ఏజీకే మున్సిపల్ ఉన్నత పాఠశాల పక్కన గల అన్నక్యాంటీన్‌లో మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పెందుర్తి పాపాయమ్మ, దండమూడి జయలక్ష్మీ, పిన్నమనేని వేణుగోపాలరావు, దండమూడి సీతారామస్వామి, పూర్ణ, రామకృష్ణ, రాధాకృష్ణ, చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.


పెదపారుపూడి నుంచి భూషణగుళ్ల వంతెన వరకు తారురోడ్డు వేస్తున్న సిబ్బంది

పెదపారుపూడి రహదారికి మరమ్మతులు

పెదపారుపూడి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ నుంచి విజయవాడ వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులోని పెదపారుపూడి నాలుగు రోడ్ల సెంటర్ నుంచి భూషణగుళ్ల గ్రామం వంతెన వరకు రహదారి నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. పెదపారుపూడి నుంచి భూషణగుళ్ల వరకు తారు రోడ్డు నిర్మించటంతో వాహనదారుల కష్టాలు తీరాయి. దీంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలు : ఏడీఏ

గుడివాడ రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రైతులకు సబ్సిడీపై యంత్రపరికరాలను అందుబాటులోకి తెస్తున్నామని ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి తెలిపారు. బుధవారం మోటూరు, వలివర్తిపాడు గ్రామాల్లోని పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పొలాలకు వెళ్లి మినుము పంట దిగుబడి ఏ విధంగా ఉంది, ఖర్చు ఏ విధంగా అవుతుంది తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు నూర్పిళ్లకు ఎంత మినుము పంట వస్తుంది తదితర విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. యంత్రపరికరాలు, స్ప్రేయర్లు, ట్రాక్టర్ల పరికరాలు సబ్సిడీపై వస్తాయని తెలిపారు. ఏవో బోలెం అనంతలక్ష్మి మాట్లాడుతూ మండలంలోని రైతులు ఆర్‌ఎస్‌కే సెంటర్లకు వెళ్లి నమోదు చేయించుకోవాలన్నారు. ఏ యంత్ర పరికరం కావాలో తదితర వివరాలు ఆర్‌ఎస్‌కే సెంటర్ దగ్గర ఆన్‌లైన్ ద్వారా నమోదు చేయించుకోవాలన్నారు. ఆర్‌ఎస్‌కేలో నమోదు చేయించుకున్న లిస్టులు మండల వ్యవసాయ అధికారి కార్యాలయానికి వస్తాయన్నారు. అర్హత ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల విస్తరణాధికారులు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి


మాజీ కేంద్ర మంత్రి కావూరిని సత్కరిస్తున్న సన్నిహితులు

మాజీ కేంద్ర మంత్రి కావూరికి ఆత్మీయ సత్కారం

గుడివాడ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): స్థానికంగా జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావును బుధవారం గాంధీబొమ్మ సెంటర్‌లో కావూరి సన్నిహితులు, బీజేపీ నాయకులు ఆత్మీయ సత్కారం చేశారు. నాటి రోజులను గుర్తు చేసుకుంటూ కావూరి తన సన్నిహితులతో సరదగా గడిపారు.

ఉపాధి హామీ పథకం పనుల పరిశీలన


ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న ఏపీవో కాటూరి సురేష్

పామర్రు,మార్చి12(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కొనసాగుతున్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం పనుల్లో నిర్దేశించిన కొలతలకు అనుగుణంగా కూలీలు పనులు చేయాలని పామర్రు మండల ఉపాధిహామీ పథకం ఏపీవో కాటూరి సురేష్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కనుమూరులో కొనసాగుతున్న ఉపాధిహామీ పథకం పనులను క్షేత్రస్థాయి పర్యవేక్షకులతో కలసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల నిర్వహణలో ప్రధానంగా పంటబోదెల పూడికతీత పనులకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. కూలీల హజరు మేరకు వేతనదారుల వివరాలను ఫీల్డ్ అసిస్టెంట్లు నమోదుచేయాలని సూచించారు. మండల వ్యాప్తంగా కొనసాగుతున్న 44 రకాల పనుల నిర్వహణలో మొత్తం 1100 మంది కూలీలు హాజరైనట్లు వివరించారు. ప్రస్తుతం కొనసాగుతున్న పనులను ఈ నెలాఖరులోగా పూర్తిచేసేందుకు క్షేత్రస్థాయిలోని సాంకేతిక సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, నాగమణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పాలకమండలి సభ్యులకు ఓంకార వెండి హారతి అందజేస్తున్న వేమూరి శ్రీహరి శ్రీనివాస్ దంపతులు

రామలింగేశ్వరునికి ఓంకార వెండి హారతి బహూకరణ

కూచిపూడి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బాలాత్రిపుర సుందరిదేవి సమేత రామలింగేశ్వర స్వామికి ఆగినిపర్రు గ్రామస్థులు వేమూరి శ్రీహరి శ్రీనివాస్ , దుర్గ దంపతులు రూ.64 వేలు విలువ గల ఓంకార వెండి హారతిని దేవాలయ పాలక మండలి సభ్యులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అర్చకులు పెనుమూడి పూర్ణచంద్రశేఖర శర్మ, సతీష్ కుమార్ శర్మ, ఉదయేశ్వర్‌లు ఈ కార్యక్రమంలో భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కళింగజాతి అభ్యున్నతికి విశేష కృషి

● రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు

గుడివాడ, మార్చి12 (ఆంధ్రజ్యోతి): కళింగ జాతి అభ్యున్నతికి మాజీ ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాలరావు చేసిన కృషి మరువలేనిదని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు పేర్కొన్నారు. స్థానిక బైపాస్‌రోడ్డులోని యలవర్తి అపార్ట్‌మెంట్‌లో కళింగ ఐక్య సేవా సంఘం ఆధ్వర్యంలో బొడ్డేపల్లి రాజ గోపాలరావు 102వ జయంతి సందర్భంగా బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రముఖ సినీ రచయిత, దర్శకుడు గున అప్పారావు రచించిన రాజ్ బహద్దూర్ అన్నెపు పరశురాం పాత్రో జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ రాజ్ బహద్దూర్ అన్నెపు పరశురాం పాత్రో బడుగు, బలహీనవర్గాలకు విద్యాసంస్థల్లో రిజర్వేషన్ సౌకర్యాన్ని 1921లో జీవో నెం.613 ద్వారా కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో సేవాసంఘం గౌరవాధ్యక్షులు సూర నరసింహారావు, తమ్మినేని రామ్మోహనరావు, సూర అక్కారావు, ఆగస్తి రాము, బెండి సత్యనారాయణ, తమ్మినేని చంద్రశేఖర్, మురళీ, బొడ్డేపల్లి రామాంజనేయులు, శ్రీనివాసరావు, వెంకట దాలయ్య పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న కళింగ ఐక్య సేవా సంఘం సభ్యులు


గుడివాడలో కేక్‌ను కట్ చేస్తున్న వైసీపీ నేతలు

ఘనంగా వైసీపీ 15వ ఆవిర్భావ దినోత్సవం

పామర్రు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమాభివృద్ధి ఒక్క వైసీపీకే సాధ్యమని ప్రజలకు నిరూపితమైందని పామర్రు మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికారప్రతినిధి కైలే అనీల్ కుమార్ అన్నారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయం వద్ద బుధవారం వైసీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన కార్యాలయంలో ఆ పార్టీ దివంగత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసీపీ శ్రేణులతో కలసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యకర్తలకు, నేతలకు స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, గ్రామ ఉపసర్పంచ్ దేవిరెడ్డి బాలవెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ ఆరుమళ్ల రమాదేవి ఆపార్టీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో నిరంతరం పోరాటాలు చేస్తామని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు మండలి హనుమంతరావు అన్నారు. పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక 35వ వార్డులోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. చంటి, నారాయణరెడ్డి, షేక్ సయ్యద్, జెడ్పీటీసీ గోళ్ల రామకృష్ణ, పాల్గొన్నారు. లింగవరంలో వైసీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఎంపీపీ గద్దె పుష్పరాణి ఆవిష్కరించారు. జెడ్పీటీసీ గోళ్ల రామకృష్ణ, నాయకులు విక్టర్, నాగబాబు, రాము, శ్రీహరి పాల్గొన్నారు

టీడీపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన


టీడీపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న టీడీపీ నేతలు

పామర్రు, మార్చి12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండిపర్రులో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సీనియర్ టీడీపీ నేత నూకవరపు వీరాంజనేయులు బుధవారం ప్రారంభించారు. పార్టీ సభ్యత్వ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను ఆయన గ్రామంలోని ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టీడీపీ సభ్యత్వ నమోదుపట్ల ప్రజలనుంచి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. సభ్యత్వం తీసుకోవడం వల్ల గ్రామాల్లో ఒక గౌరవంతోపాటు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందన్నారు. వందరూపాయల టీడీపీ సభ్యత్వం తీసుకున్న ప్రతి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలందరికీ ఐదులక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ప్రజలందరూ టీడీపీ సభ్యత్వ నమోదును సద్వినియోగం చేసుకోవాలని వీరాంజనేయులు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ బూత్ కన్వీనర్లు పసుపులేటి విజయకుమార్, ముదునూరు సువర్ణరాజు, టీడీపీ మహిళా నేతలు, కార్యకర్తలు , తదితరులు పాల్గొన్నారు.

జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

● కెరీర్ కౌన్సిలర్ డాక్టర్ ఏపూరి శ్రీనివాస్

గుడివాడ, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : ముందస్తు ప్రణాళికతో జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకుంటే లక్ష్యాన్ని సాధించడం సులవవుతుందని కెరీర్ కౌన్సిలర్ డాక్టర్ ఏపూరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్‌పై డిగ్రీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు వివరణాత్మక విశ్లేషణతో వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు రాజశేఖర్, కార్యదర్శి కిరణ్‌బాబు, కోశాధికారి ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి నరేష్, పూర్వ అధ్యక్షులు రమణమూర్తి, సభ్యులు, ప్రసాద్, జ్యోతీశ్వరరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టూరి రవీంద్రబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



డాక్టర్ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు